
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు
జిల్లా వార్తలు
శనివారం 13 ఏప్రిల్ 2024



ఇంటర్‌లో ప్రభుత్వం ఫెయిల్



ఇంటర్ పరీక్షల్లో ప్రభుత్వం ఫెయిలైంది. పాఠ్యపుస్తకాలు సరఫరా చేయక.. బోధనపై పర్యవేక్షణ లేక పోవడం వంటి వైఫల్యాలు ఫలితాలపై ప్రభావం చూపాయి. ఇంటర్మీడియట్ విద్యా మండలి శుక్రవారం విడుదల చేసిన ఫలితాల్లో రాష్ట్రంలోనే చిత్తూరు జిల్లా చిట్టచివరి స్థానంలో నిలిచింది.

● సరఫరాకాని పాఠ్యపుస్తకాలు ● బోధనపై తగ్గిన పట్టు.. పర్యవేక్షణ లోపం..

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 12: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు రెండేళ్లుగా ప్రభుత్వం ఉచిత పాఠ్యపుస్తకాలను సరఫరా చేయలేదు. అదిగో.. ఇదిగో పాఠ్యపుస్తకాలు వస్తాయని ఎదురు చూశారు. చివరికి ప్రభుత్వం చేతులెత్తేసింది. విద్యా సంవత్సరం మధ్యలో బహిరంగ మార్కెట్‌లో పాఠ్యపుస్తకాలు లభ్యమైనా, అది కేవలం ప్రైవేటు కళాశాలల విద్యార్థులకు కొంత ప్రయోజకరంగా మారింది. పేద విద్యార్థులు కొనుగోలు చేయలేని పరిస్థితి. ఈ క్రమంలో గతేడాది ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు చొరవ చూపి పూర్వ విద్యార్థుల నుంచి పాత పాఠ్యపుస్తకాలు తెప్పించుకుని కొందరికి సర్దుబాటు చేశారు. ఈ ఏడాది ఆ ప్రయత్నం చేసినా సఫలం కాలేదు. దీంతో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు లేకుండా పోయాయి. పాఠ్యపుస్తకాల్లేకుండా చదువులు సాగించాల్సి వచ్చింది. మరోవైపు బోధన విషయంలోనూ పట్టు తప్పింది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో విద్యాప్రమాణాలు తీసుకొస్తామని ప్రభుత్వం చెప్పిందే కానీ.. అమలు కాలేదు. పలు కళాశాలల్లోని రెగ్యులర్, కాంట్రాక్టు అధ్యాపకుల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరు విద్యార్థుల చదువుపై పడింది. ఎక్కుమంది అధ్యాపకులు హాజరుపై దృష్టి సారించి.. బోధన పట్ల ఆసక్తి చూపలేదనే విమర్శలున్నాయి. ఒకవేళ ఎవరైనా అడిగితే.. సరైన పాఠ్యపుస్తకాలు లేకుండా ఎలా బోధించాలని చెప్పి తప్పించుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి.

● ఇక, గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యార్థులు దూరప్రాంతాల్లోని జూనియర్ కళాశాలలకు రావాల్సి ఉంటుంది. గ్రామాల్లో ఉదయాన్నే తల్లిదండ్రులు పొలాలకు, పనులకు వెళ్లిపోవడం వల్ల మధ్యాహ్న భోజనం తీసుకురావడానికి ఇబ్బందిగా మారింది. అందుకని తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు వీరికి మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేశారు. జగన్ సీఎం అయ్యాక ఈ పథకం ఆపేశారు. దీంతో గ్రామీణ విద్యార్థులు కళాశాలలకు హాజరవడం తగ్గింది. ఇది వారి చదువు, ఫలితాలపైనా ప్రభావం చూపిందని అధ్యాపకవర్గాలు అంటున్నాయి.

పర్యవేక్షణ లోపం

అన్నింటికి మించి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపించింది. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ జిల్లా పర్యటన నేపథ్యంలో జూనియర్ కళాశాలలు పర్యవేక్షించారు. మిగిలిన ఇతర అధికారులెవ్వరూ ఏడాది పొడుగునా కళాశాలల్లో బోధన తీరుపై దృష్టి పెట్టలేదు. కనీసం ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ కూడా ఇదే ధోరణిలో ఉన్నారన్న ఆరోపణలున్నాయి.

ఫలితాల్లో అట్టడుగున జిల్లా

● ఫస్టియర్ 49.65, సెకండ్ ఇయర్ 62.64 శాతం ఉత్తీర్ణత

ఇంటర్‌లో రాష్ట్రంలోనే జిల్లా అట్టడుగు స్థాయి ఫలితాలు సాధించింది. జిల్లాల విభజన తర్వాత.. కొత్త జిల్లాల వారీగా ఈ ఏడాది ఫలితాలు ప్రకటించారు. జిల్లాకు సంబంధించి ఇంటర్ మొదటి సంవత్సరంలో 13,224 మందికిగాను 6566 మంది ఉత్తీర్ణత (49.65 శాతం) సాధించగా, 6658 మంది ఫెయిలయ్యారు. ద్వితీయ ఇంటర్‌లో 10882 మందికి గాను 6817 మంది ఉత్తీర్ణత (62.64 శాతం) సాధించగా, 4065 మంది ఫెయిలయ్యారు.

బాలికలదే హవా

- ఎప్పటిలానే ఈ ఏడాది ఇంటర్ పరీక్షా ఫలితాల్లోనూ బాలికలు హవా చూపారు. మొదటి సంవత్సరానికి సంబంధించి 6701 మంది బాలికలు పరీక్ష రాయగా, 3847 మంది (57 శాతం) అయ్యారు. 2854 మంది ఫెయిలయ్యారు. అలాగే, 6523 మంది బాలురకుగాను 2719 మంది (42 శాతం) ఉత్తీర్ణులు కాగా, 3804 మంది ఫెయిలయ్యారు.
- ద్వితీయ సంవత్సరంలో 5585 మంది బాలికలు పరీక్షలు రాయగా, 3820మంది (68 శాతం) పాస్ అయ్యారు. 1765 మంది ఫెయిలయ్యారు. ఇక, 5297 మంది బాలురుకుగాను 2997 మంది (57 శాతం) ఉత్తీర్ణులయ్యారు. 2300 మంది ఫెయిలయ్యారు.

రెసిడెన్షియల్ ఫస్ట్.. హైస్కూల్ ప్లస్ లాస్ట్

- ఏపీ రెసిడెన్షియల్ కళాశాలల్లో 2418 మందికి గాను 2382 మంది పరీక్షలు రాయగా, 2237 మంది (93.91 శాతం) ఉత్తీర్ణులై జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారు.
- కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో 1484 మందికి గాను 1428 మంది పరీక్షలు రాయగా, 1248 మంది (87.39 శాతం) ఉత్తీర్ణులయ్యారు.
- ప్రైవేటు యాజమాన్య కళాశాలల్లో 1,09,001 మందికి గాను 1,04,815 మంది పరీక్షలు రాయగా, 84148 మంది (80.28 శాతం) ఉత్తీర్ణత సాధించారు.
- మోడల్ స్కూల్స్‌లో 4061 మందికి గాను 4005 మంది పరీక్షలు రాయగా, 3199 మంది (79.87 శాతం) ఉత్తీర్ణులయ్యారు.
- ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 30,932 మందికి గాను 29,074 మంది పరీక్షలు రాయగా, 19788 మంది (68.06 శాతం) ఉత్తీర్ణత సాధించారు.
- తాజాగా ఉన్నత పాఠశాలల్లో ఉన్నతీకరణ చేసిన హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో మొత్తం 3487 మందికి గాను 3286 మంది పరీక్షలు రాయగా, 1839 మంది (55.96 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఇలా తక్కువ ఉత్తీర్ణతతో ఈ కళాశాలలు చివరి స్థానంలో నిలిచాయి.

14 నుంచి రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు

ఇంటర్మీడియట్‌లో మార్కులు తక్కువగా వచ్చాయనే భావనతో ఉన్న విద్యార్థులు రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఇంటర్ బోర్డు అవకాశం కల్పించింది. ఈనెల 14 నుంచి 24వ తేదీ వరకు సబ్జెక్టు వారిగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

మే 24నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫెయిలైన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు రాసే వీలుగా షెడ్యూల్ విడుదల చేసింది. మేనెల 24వ తేది నుంచి జూన్ ఒకటో తేది వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. కాగా, మే ఒకటి నుంచి 4వ తేదీ వరకు జిల్లా కేంద్రంలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తారు. ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు పరీక్షల ఫీజు చెల్లించాల్సి ఉంది.

విషాదం

ఇంటర్ తప్పాడని విద్యార్థి ఆత్మహత్య

● మరో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

వి.కోట, ఏప్రిల్ 12: వి.కోట మండలం మిట్టూరులో ఇంటర్ తప్పాడన్న మనస్తాపంతో 16 ఏళ్ల విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తిరుపతిలోని ఓ ప్రైవేటు కళాశాలలో జూనియర్ ఇంటర్ చదువుతున్నాడు. శుక్రవారం వచ్చిన ఫలితాల్లో ఫెయిల్ కావడంతో ఇంటి సమీపంలోని షెడ్డు వద్ద గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విద్యార్థి మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

శాంతిపురం: మఠం గ్రామంలో గంగోత్రి ఫస్టియర్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుప్పం పీఈఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి మెరుగుపడుతున్నట్లు వైద్యులు తెలిపారని కుటుంబ సభ్యులు చెప్పారు.

రామకుప్పం: తిరుపతిలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న సింగసముద్రం గ్రామానికి చెందిన మిత్ర.. ఫెయిలవడంతో పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. అపస్మారకంగా ఉన్న ఆమెను కుటుంబసభ్యులు కుప్పం ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి మెరుగ్గా ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

బీసీవై పార్టీ వాహనాలొస్తే కాల్చేస్తాం

ప్రచార వాహనాలను ధ్వంసం చేసిన పెద్దిరెడ్డి అనుచరులు

నేతలపైనా దాడి





బీసీవై పార్టీ నేత ఆనందరెడ్డిపై దాడి చేస్తున్న హరినాథరెడ్డి

ప్రచార రథాలను ధ్వంసం చేస్తున్న వైసీపీ నేత హరినాథరెడ్డి

పుంగనూరు, ఏప్రిల్ 12: 'మా గ్రామానికి బీసీవై పార్టీ వాహనాలు రాకూడదు. ఒకవేళ వస్తే పెట్రోల్ పోసి కాల్చేస్తాం' అంటూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు అల్టిమేటం జారీ చేశారు. సదుం మండలం రెడ్డివారిపల్లె పంచాయతీ చిలకపాటివారిపల్లెకు శుక్రవారం సాయంత్రం వచ్చిన బీసీవైపీ (భారత చైతన్య యువజన పార్టీ) వాహనాలను ధ్వంసం చేశారు. ఆ పార్టీ నేతలపైనా దాడి చేశారు. బీసీవై పార్టీ నాయకులు ఆనందరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి మాట్లాడుతూ.. సదుం, పులిచెర్ల మండలాల్లో తమ పార్టీ తరపున ఎన్నికల ప్రచారానికి పుంగనూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి నుంచి అనుమతి పొందామన్నారు. రాత్రివేళ ఈ వాహనాలను ఆనందరెడ్డి ఇంటి వద్ద పెట్టుకునేందుకు చిలకపాటివారిపల్లెకు తీసుకొచ్చామన్నారు. గ్రామంలోకి రాగానే వైసీపీ నాయకుడు హరినాథరెడ్డి, మరికొందరు నేతలు, కార్యకర్తలు కర్రలతో దాడి చేసి వాహనాలను ధ్వంసం చేసినట్లు చెప్పారు. తమను దుర్భాషలాడారన్నారు. గ్రామం నుంచి వెంటనే వెళ్లిపోకుంటే చంపేస్తామని బెదిరించారన్నారు. ఆనందరెడ్డి ఇంటిపైనా రాళ్లు వేశారన్నారు. వాహనాలపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టడానికి ప్రయత్నించగా.. అప్పటికే తమ సమాచారంతో అక్కడికి వచ్చిన పోలీసులు వారిని అడ్డుకున్నట్లు తెలిపారు. కాగా, విచారణ పేరిట పోలీసులు ఆనందరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డిని పోలీసు స్టేషనుకు తీసుకెళ్లారు. తమపై జరిగిన దాడికి సంబంధించి వీరిద్దరూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలో పెద్దిరెడ్డి అనుచరులు చేస్తున్న దాడులు, వాహనాల ధ్వంసం చేసిన సంఘటనపై బీసీవైపార్టీ అధినేత రామచంద్ర యాదవ్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థులపై కేసు

చిత్తూరు, ఏప్రిల్ 12: చిత్తూరులో రంజాన్ రోజున ఈద్గా మైదానంలో మత ప్రార్థనల సమయంలో చోటు చేసుకున్న ఉద్రిక్తతల నేపథ్యంలో వైసీపీ, టీడీపీ అభ్యర్థులపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ శుక్రవారం తెలిపారు. 171 సెక్షన్ కింద వీరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. రంజాన్ సందర్భంగా గురువారం చిత్తూరులోని గిరింపేట ఈద్గా వద్దకు టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్, వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డి చేరుకున్నారు. ప్రార్థనలు అయ్యాక విజయానందరెడ్డి మాత్రం మైకు తీసుకుని ఎన్నికల ప్రచారంలా ప్రసంగం చేశారు. టీడీపీ అభ్యర్థికి మైకు ఇవ్వకుండా వైసీపీ నేతలు లాగేసుకున్నారు. మరో మైకును పని చేయకుండా చేశారు. దీనిపై టీడీపీ వర్గీయులు అభ్యంతరం చెప్పారు. అలాగే, టీడీపీ ముస్లిం నేతలను వైసీపీ అభ్యర్థి బెదిరించడం, ఈద్గాలో డబ్బులు పంపిణీ చేయడం విమర్శలకు తావిచ్చింది. టీడీపీ అభ్యర్థి జగన్మోహన్ సంయమనం పాటించి అక్కడ్నుంచి వెళ్లిపోయిన విషయం తెలిసిందే.

రౌడీ షీట్ ఓపెన్ చేస్తామంటూ పోలీసుల హంగామా

● పుంగనూరు ఆర్వోకు బీజేపీ నేత ఫిర్యాదు



తన ఇంటి ముందున్న పోలీసులు కనిపించేలా ప్రేమ్‌కుమార్ సెల్ఫీ

పుంగనూరు, ఏప్రిల్ 12: 'ఎన్నికల సమయంలో ఒళ్లు జాగ్రత్తగా పెటుకో. నీపై రౌడీషీట్ ఓపెన్ చేస్తున్నాం. పోలీసుస్టేషన్‌కి రా' అంటూ గురువారం రాత్రి పుంగనూరు అసెంబ్లీ బీజేపీ కో కన్వీనర్, అడ్వకేట్ పూల ప్రేమ్ కుమార్ ఇంటి వద్ద పోలీసులు హంగామా సృష్టించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుసూదన్‌రెడ్డికి పోలీసులపై ఫిర్యాదు చేశారు. 'మా ఇంటికి గురువారం రాత్రి 11.30 గంటలకు ఇద్దరు పోలీసులు వచ్చి గట్టిగా అరుస్తూ హారను కొట్టారు. ఎందుకు అరుస్తున్నారని ప్రశ్నించగా.. నీవేనా ప్రేమ్‌కుమార్, నీపై రౌడీషీట్ ఓపెన్ చేస్తున్నాం. వెంటనే మాతో పాటు పోలీసు స్టేషన్‌కు రావాలని చెప్పారు. ఈ సమయంలో ఎందుకు రావాలి? నోటీసు ఏదైనా తెచ్చారా? రౌడీషీట్ తెరవాలంటే కోర్టు అనుమతి, దానికి ఒక పద్ధతి ఉంటుందని చెప్పా. దీంతో పోలీసులు నాపై దురుసుగా ప్రవర్తించారు. ఎస్ఐ పంపారా, సీఐ పంపారా అని అడిగితే ఒళ్లు జాగ్రత్తగా పెట్టుకో అని హెచ్చరించారు. మీ కొడుకుపైన కేసులు పెడుతున్నామని మా తల్లిదండ్రులను భయాభ్రాంతులకు గురి చేశారు. బీజేపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న తనపై పోలీసులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ బెదిరిస్తున్నారు' అంటూ పోలీసులపై ఆయన ఆర్వోకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్, జిల్లా ఎన్నికల అధికారులకూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ వర్గీయుల దాడి

● కులం పేరుతో దూషించారని రివర్స్‌లో ధర్నా

చిత్తూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డి డ్రైవర్ స్కైలా కుమారుడు బానేష్, అతడి వర్గీయులు కలిసి టీడీపీ కార్యకర్త హర్షపై దాడి చేశారు. ఆ తర్వాత తమను కులం పేరుతో దూషించారని రివర్స్‌లో ధర్నా చేశారు. వివరాల్లోకి వెళితే.. ఎస్ఆర్‌పురం మండలం 49.కొత్తపల్లిమిట్ట గ్రామంలో శుక్రవారం మహాభారతం ఉత్సవం జరిగింది. ఇక్కడికి గ్రామస్థులంతా హాజరయ్యారు. ఇటీవల రేణిగుంటలో నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన అదే గ్రామానికి చెందిన హర్ష అనే యువకుడు వచ్చారు. టీడీపీలో చేరాడని హర్షతో బానేష్ ఉద్దేశపూర్వకంగా గొడవ పెట్టుకున్నారు. తన వర్గీయులతో కలిసి హర్షను కొట్టారు. గ్రామస్థులు కల్పించుకుని సర్దుబాటు చేశారు. హర్ష, రైల్వేలో హెడ్ కానిస్టేబుల్ అయిన తన తండ్రి మునికన్నారెడ్డిని, చిన్నాన్న శ్రీనివాసులును పిలుచుకుని సంఘటనా స్థలానికి వచ్చారు. తనను కొట్టారని చెప్పారు. తండ్రి, చిన్నాన్న ప్రశ్నించగా, బానేష్ వర్గీయులు మరోసారి హర్ష, శ్రీనివాసులు మీద దాడి చేశారు. హర్ష తండ్రి మునికన్నారెడ్డికి చెందిన కారు అద్దాలు ధ్వంసం చేశారు. అంతటితో ఆగక, తమను కులం పేరుతో దూషించారని చిత్తూరు- పుత్తూరు ప్రధాన రహదారి మీద ధర్నా చేశారు. ఇరువర్గాల వారూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు సివిల్ జడ్జి పోస్టులకు రాతపరీక్షలు

చిత్తూరు లీగల్, ఏప్రిల్ 12: ఉమ్మడి జిల్లా పరిధిలోని 39 సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పోస్టులకు శనివారం రాతపరీక్ష జరగనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు ఐయాన్ డిజిటల్ జోన్ ఐడీజడ్, జూపార్క్ తిరుపతి, జూపార్కు రోడ్డు చెర్లోపల్లె వద్ద జరుగుతాయని నిర్దేశించిన సమయానికి 15 నిమిషాల ముందే పరీక్షాకేంద్రంలోకి ప్రవేశించాలని, హాల్‌టిక్కెట్‌తోపాటు ఐడీ ప్రూఫ్‌ను తీసుకెళ్లాలని ఆయన పేర్కొన్నారు.


దొంగ నోట్లతో పట్టుబడిన పుంగనూరు యువకులు

● హైదరాబాద్‌లో అరెస్టు చేసిన పోలీసులు

చిత్తూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలానికి చెందిన ఇద్దరు యువకులు దొంగ నోట్లతో తెలంగాణలో పట్టుబడటం.. వీరిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేయడం స్థానికంగా కలకలం రేపింది. పుంగనూరు మండలం గుడిసిబండ గ్రామానికి చెందిన గంగరాజు (24), చిన్నకొండచెర్ల గ్రామానికి చెందిన అభినందన్‌రెడ్డి(22)ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమిళనాడుకు చెందిన రవికి బెంగళూరులో నకిలీ కరెన్సీని గంగరాజు విక్రయించే ప్రయత్నం చేశాడు. రవితో డీల్ కుదరక అక్కడి నుంచి తిరిగి హైదరాబాదుకు వచ్చేశాడు. హైదరాబాద్‌లోని మైలార్‌దేవ్‌పల్లి మెహఫిల్ హోటల్‌లో నకిలీ నోట్ల చెలామణికి ఇంకో డీల్ మాట్లాడాడు. ఈ డీల్ జరుగుతున్న సమయంలోనే ఎస్‌వోటీ పోలీసులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మహారాష్ట్రలో ఈ ఫేక్ కరెన్సీని ముద్రిస్తున్నట్లు వెల్లడైంది. గంగరాజు, అభినందన్‌రెడ్డి వద్ద పోలీసులు 500 నోట్లున్న 10 కట్టలను గుర్తించారు. దీని వెనుక ఎవరున్నారనే కోణంలో లోతుగా విచారిస్తున్నారు.

పంట పొలాలపై అర్ధరాత్రి ఏనుగుల దాడి

● నష్టాల్లో రైతులు, భయాందోళనలో గ్రామస్తులు



పంటపొలాల్లో ఏనుగులు



ధ్వంసమైన కూసాలు

గుడిపాల, ఏప్రిల్ 12: తమిళనాడు సరిహద్దు ప్రాంతంలోని గుడిపాల మండలం పల్లూరు అటవీ ప్రాంతంతోపాటు రైతు పొలాలపై గురువారం అర్ధరాత్రి ఏనుగులు దాడి చేశాయి. గ్రామానికి సంబంధించిన రైతుల వరిపైరు, ట్రెంచ్‌లను మూడు ఏనుగులు ధ్వంసం చేశాయి. రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. స్థానికులు కేకలు వేయడంతో ఏనుగులు తమిళనాడు వైపు మళ్లాయి. తిరిగి ఎక్కడ గ్రామం మీదకు వస్తాయోనని గ్రామస్తులు భయాందోళనలో ఉన్నాయి.

దిక్సూచి DIKSUCHI

మంచోడని మన గురించి నలుగురూ చెప్పుకోవాలని అనుకోవడం సర్వ సాధారణం. సగటు మానవుడి సాధారణ కోర్కెగా కూడా దీన్ని చెప్పుకోవచ్చు. అయితే దీనికి సంబంధించిన ఆధునిక రూపమే లెటర్ ఆఫ్ రికమెండేషన్(ఎల్ఓఆర్). ఇక్కడ కాన్సెప్ట్ మంచోడని కాదు, విదేశీ విద్యా సంస్థలో సీటుకు అర్హుడు అని సిఫార్సు చేయాల్సి ఉంటుంది. అది తను చదువుకున్న సంస్థకు చెందిన ప్రొఫెసర్ల వంటి వారు అన్నమాట. మరీ ముఖ్యంగా విదేశాల్లో చదువుకోవాలంటే అవసరమైన పత్రాల్లో ఇది కీలకమైనది అని కూడా చెప్పవచ్చు.



విదేశాల్లో చదువుకు కీలకం
లెటర్ ఆఫ్ రికమండేషన్

విదేశాల్లో చదవాలని భావించే అభ్యర్థి కేరెక్టర్, డెడికేషన్, అకడమిక్ ఆప్టిట్యూడ్‌కి సంబంధించి విలువైన విషయాలను ఈ లెటర్ తెలియజేస్తుంది. కాలేజీ ప్రొఫెసర్లు, ఎంప్లాయర్లు మెంటార్లు, విభాగాధిపతులు ఇచ్చే ఈ లెటర్లతో అభ్యర్థి క్రెడిబిలిటీ పెరుగుతుంది, పోటీతత్వం కూడా తెలుస్తుంది. స్ట్రక్చర్డ్ ఫార్మేట్‌కు తోడు సరైన ఉదాహరణలతో ఉండే లెటర్ ఒక వ్యక్తి స్థిరత్వం తదితరాలను తెలియజేస్తుంది. అకడమిక్ కెరీర్‌లో అభ్యర్థి సాధించిన గ్రేడ్స్, క్రెడిట్స్‌కు మించిన విషయాలు ఈ లెటర్‌లోనే వెల్లడి అవుతాయని కూడా చెప్పవచ్చు. కోరుకున్న కోర్సులో సీటు లభించేందుకు తోడ్పడుతుంది. అభ్యర్థికి ఉన్న విశ్వసనీయత, పోటీతత్వాన్ని పెంచడం ద్వారా సీటు పొందడానికి ఉన్న అవకాశాలు పెరుగుతాయి. పొందికగా తీర్చిదిద్దిన లెటర్ ఆఫ్ రికమండేషన్ నిజానికి విదేశాల్లో చదవాలని ఆకాంక్షించే అభ్యర్థి లక్ష్య సాధనలో ఇతోధికంగా తోడ్పడుతుంది.

ఎవరితో... ఎందుకు

లెటర్ ఆఫ్ రికమండేషన్‌ను ఎవరితో రాయించుకోవాలి అన్నది ఒక ప్రశ్న. వివిధ వర్గాల ద్వారా సమీకరించిన సమాచారాన్ని మదించుకుని మరీ ఆ వ్యక్తిని ఎంపిక చేసుకోవాలి. అలా సిఫార్సు చేయించుకోదగ్గ వ్యక్తుల్లో ప్రొఫెసర్ల నుంచి డిపార్ట్‌మెంట్ హెడ్ లేదా డీన్, ఉద్యోగం చేసి ఉంటే ఎంప్లాయర్, పరిశోధన పర్యవేక్షకుల వరకు అందరూ వస్తారు. మెంటార్లు, కోచ్‌లు, గైడెన్స్ కౌన్సెలర్లను కూడా పరిగణనలోకి తీసుకోవచ్చు. అభ్యర్థి నాయకత్వ పటిమ, టీమ్ వర్క్, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన విషయాలను విస్తారంగా, విపులంగా, వివరంగా వీరు మాత్రమే ప్రస్తావించగలుగుతారు.

అకడమిక్, నాన్ అకడమిక్ అంశాల సమ్మిళితంగా ఉన్న రికమండేషన్ లెటర్, అభ్యర్థికి ఉన్న సామర్థ్యాలను సమగ్రంగా తెలియజేయగలుగుతుంది. రికమండ్ చేసే ప్రతి వ్యక్తి తనదైన కోణంలో అభ్యర్థి సదరు కోర్సు చేసేందుకు ఎలా, ఎందుకు అర్హుడో తెలియజేస్తారు. లెటర్ మాత్రం వ్యక్తిని ఉద్దేశించి అంటే పర్సనలైజ్డ్ వ్యవహారంగా ఉన్నప్పుడు మాత్రమే పోటీలో ఎల్ఓఆర్ యూనిక్‌గా కనిపిస్తుంది. చివరగా అది అభ్యర్థిత్వానికి ఒక విద్యాసంస్థ ఓకే చెప్పడానికి బలమైన ప్రాతిపదికగానూ మారుతుంది.

కరెక్ట్ ఫార్మేట్

ఈ లెటర్‌కు సంబంధించినంతవరకు కోర్ ఎలిమెంట్ అంతా ఒక్కటే. ఒక అభ్యర్థి సీటు పొందేందుకు అవసరమైన సిఫార్సు అందులో ఉంటుంది. అయితే కోర్సును బట్టి చిన్నపాటి మార్పులు లెటర్ రాసే తీరులో ఉంటుందని గమనించాలి. ఫార్మేట్, సిఫార్సు చేసే వ్యక్తి - అందుకునే వ్యక్తి కాంటాక్ట్ సమాచారం తదితరాలు యథాతథం. లెటర్‌ను ఉద్దేశించిన వ్యక్తిని గౌరవప్రదంగా సంబోధించడం సహా సాధారణ విషయాలకు తోడు అందులోని కంటెంట్ అభ్యర్థితో తనకు ఉన్న సంబంధాన్ని తెలియజేయాలి. తనకు ఎంత కాలం నుంచి తెలుసు, ఇద్దరి మధ్య ఉన్న బాండింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ఒకరకంగా అభ్యర్థి వ్యక్తిగత విషయాలకు సంబంధించి తనది భరోసా అన్న విధంగా ఉండాలి.

లెటర్ బాడీలో అభ్యర్థి అర్హతలు, సాధించిన విజయాలు, సంబంధిత అనుభవం, కోర్సులో చేర్చుకునేందుకు అర్హుడు అంటూ తెలియజేసే ఉదాహరణలు ఉండాలి. ఇదంతా చదివితే అభ్యర్థికి ఉన్న బలాలు, నైపుణ్యాలు, కేరక్టర్ తెలియడమే కాదు, ఎంపిక చేసేందుకు దోహదపడాలి. అభ్యర్థి విశ్వసనీయతను పెంచాలి. అలాగే లెటర్ చివరి పేరాలో ముందు చెప్పిన అంశాలను క్రోడీకరించాలి. ఇంకేమైనా సమాచారం అవసరమైతే అది కూడా అందించేందుకు తాను సిద్ధమని కూడా తెలియజేయాలి. లెటర్ రాసిన వ్యక్తి సంతకం, కాంటాక్ట్ సమాచారం చివర్లో ఉండాలి. ప్రొఫెషనల్ సైన్-ఆఫ్‌తో మొత్తం పద్ధతిగా ఉండాలి.

ఈ ఆరూ ముఖ్యం

- లెటర్ ఆఫ్ రికమండేషన్స్ ఎన్ని సమర్పించినప్పటికీ అవి అభ్యర్థిలో ఉండే వివిధ కోణాలను చెప్పగలగాలి. విజయాలు, పర్సనాలిటీ అకడమిక్ లేదా ఎక్స్‌ట్రాకరిక్యుల్ సక్సెస్‌ను తెలియజేయగలగాలి. ఉదాహరణకు పరిశోధన నైపుణ్యాలు ఒక లెటర్‌లో ఉంటే మరొక దానిలో తరగతి గదిలో అభ్యర్థి కనబరిచిన సామర్థ్యాలను తెలియజేయాలి.
- రికమండ్ చేసే వ్యక్తికి మీరు తెలిసినప్పటికి సంబంధిత బేసిక్ సమాచారాన్ని అభ్యర్థి అందించాలి. సీవీ, అకడమిక్ జీపీఏలు, ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్, లెటర్ సబ్మిషన్‌కు డెడ్‌లైన్ తదితరాలు తెలియజేయాలి. అప్పుడే సదరు రికమెండర్ తన సిఫార్సును చక్కగా డ్రాఫ్ట్ చేయగలరు.
- ఆ లెటర్‌లో ప్రత్యేకించి కొన్ని సందర్భాలు, ఉపాఖ్యానాలు కూడా ఉండాలి. అభ్యర్థి లక్షణాలను తెలియజేసే విధంగా అవి ఉండాలి. లక్షణాలు, నైపుణ్యాలు తదితరాలను కేవలం ధ్రువీకరణలతో సరిపెట్టకూడదు. వాటికి సరైన ఉదాహరణలనూ జోడించాలి. రీసెర్చ్ ప్రాజెక్టుల్లో అనుభవాలు లేదంటే చోటుచేసుకున్న చర్చలను కూడా కలిపితే అభ్యర్థి క్రెడిబిలిటీ పెరుగుతుంది.
- ఆ లెటర్‌లో అభ్యర్థికి సంబంధించిన బలాలకు తోడు అకడమిక్ ప్రోగ్రెస్, డెవలప్‌మెంట్‌కూ తగు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆ అంశాల్లో కచ్చితత్వాన్ని అడ్మిషన్ కమిటీ ఎవాల్యుయేట్ చేస్తుంది. బలహీనతలను ఎలా అధిగమిస్తారన్నది కూడా చూస్తుంది.
- లెటర్ డ్రాఫ్టింగ్‌లో సమతుల్యత పాటించాలి. అస్సలు ఏమీ లేకపోవడం లేదంటే పెద్ద ఎత్తున విషయాలను కుమ్మరించడం... రెండూ పనికిరావు. ప్రొఫెషనల్ అయినప్పటికీ పర్సనలైజ్డ్ సిఫార్సులకు అడ్మిషన్ కమిటీ ప్రాధాన్యం ఇస్తుంది. అందుకని ప్రతి లెటర్ దేనికది యూనిక్‌గా ఉండాలి. బేసిక్ ఫార్మాట్ నుంచి పక్కకు తప్పకుండానే కంటెంట్ తదితర విషయాల్లో తగు జాగురూకత పాటించాలి. మొత్తమ్మీద బ్యాలెన్స్ తప్పకుండా చూసుకోవాలి.
- ప్లగారిజాన్ని తప్పించాలి. మరొక లెటర్‌కు కాపీ కారాదు. ఒరిజినల్ అనిపించాలి. కాపీని సులువుగా పట్టేస్తారు. ముందునుంచీ చెబుతున్నట్టు లెటర్ ఒరిజినల్‌గా ఉండేలా చూడాలి. అభ్యర్థిని తీసుకునేలా ఉండాలే తప్ప ఒక డూప్లికేట్ మాదిరిగా అనిపించి అసలుకే మోసం తెచ్చేలా ఉండకూడదు. అంటే కాపీ, పేస్ట్ పని మంచిది కాదని గుర్తించాలి.

ఈఎస్‌సీఐలో పీజీ డిప్లొమా

హైదరాబాద్, గచ్చిబౌలీలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఈఎస్‌సీఐ)కు చెందిన స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్(ఎస్‌పీజీఎస్)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైం ప్రోగ్రామ్. ఏడాదికి రెండు చొప్పున నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌కు ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఎడ్యుకేషనల్ లోన్ సౌకర్యం ఉంది. మెరిట్ స్కాలర్‌షిప్స్, ప్లేస్‌మెంట్స్ కూడా ఉన్నాయి.

స్పెషలైజేషన్‌లు: ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్, జనరల్ మేనేజ్‌మెంట్, ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్.

అర్హత వివరాలు: ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు ఇంజనీరింగ్/టెక్నాలజీ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు ఆర్ట్స్/కామర్స్/సైన్స్/మేనేజ్‌మెంట్ సబ్జెక్టులతో డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు ఇంజనీరింగ్/టెక్నాలజీ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులు; ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా సైన్స్ డిగ్రీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. క్యాట్/మ్యాట్/ఏటీఎంఏ/ఎక్స్‌ఏటీ/ఐసెట్ అర్హత పొంది ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** esci.edu.in, escihyd.org

ఎన్‌ఎస్‌డీలో డిప్లొమా

ప్రపంచంలోనే తొలి థియేటర్ ట్రైనింగ్ సంస్థగా 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా'గా పేరుంది. 1959లో సంగీత నాటక అకాడమీ విభాగంగా ఈ సంస్థ ఆరంభమైంది. 1975లో స్వతంత్ర ప్రతిపత్తిని పొందింది. కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ విభాగం నిధులతో ప్రస్తుతం పనిచేస్తోంది. తగు జాగ్రత్తలతో ఒక ప్రణాళిక ప్రకారం రూపొందించిన సిలబస్, శిక్షణతో పకడ్బందీగా సంస్థను నిర్వహిస్తున్నారు.

ప్రస్తుతం ఈ సంస్థ డ్రమటిక్ ఆర్ట్స్‌లో మూడేళ్ల కాలవ్యవధి కలిగిన డిప్లొమాకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కోర్సులో చేరిన విద్యార్థులను యాక్టింగ్, డిజైన్, డైరక్షన్‌కు తోడు థియేటర్ సంబంధ డిసిప్లిన్స్‌లో ప్రొఫెషనల్స్‌గా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన కోర్సు ఇది. ఈ ఏడాది జూలై 24 నుంచి కోర్సు ఆరంభమవుతుంది. సీట్లు 32 కాగా వీటిలో మూడింటిని విదేశీ విద్యార్థులకు కేటాయించారు. హిందీ ఇంగ్లీష్ మాధ్యమాల్లో బోధన ఉంటుంది.

అర్హత: ఏ డిసిప్లిన్‌లో అయినా మూడేళ్ల డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఆరు వేర్వేరు థియేటర్ ప్రొడక్షన్స్‌లో పాల్గొని ఉండాలి. అందుకు తగు ప్రూఫ్‌ని సమర్పించాలి. హిందీ/ ఇంగ్లీష్ భాషలు తెలిసి ఉండాలి. ఈ ఏడాది జూలై 1 నాటికి



వయసు 18-30 మధ్య ఉండాలి. రిజర్వుడు వర్గాలకు నిబంధనల మేరకు సడలింపు ఉంటుంది.

ఎంపిక: ఇది రెండు దశలుగా ఉంటుంది. ప్రిలిమినరీ ఎగ్జామ్ ఉంటుంది. ఇందులో ఎంపికైన వారికి ఫైనల్ ఎగ్జామినేషన్ వర్క్‌షాప్ ఉంటుంది. దేశంలోని వివిధ నగరాల్లో వేర్వేరు తేదీల్లో ఈ రెండూ జరుగుతాయి. హైదరాబాద్‌లో మే 27న జరుగుతుంది. వివరాలు ఎన్‌ఎస్‌డీ వెబ్‌సైట్‌లోనూ ఉంటాయి. తుది ఎంపిక న్యూఢిల్లీలో ఉంటుంది. జూన్ 23 నుంచి 27 వరకు అంటే అయిదు రోజులు ఉంటుంది. దీనికి పిలిచిన అభ్యర్థులకు వారి సొంత ఊరి నుంచి ట్రావెల్ ఎక్స్‌పెన్సస్‌కు తోడు డీఏ చెల్లిస్తారు. నిపుణులతో కూడిన కమిటీ వీరి ప్రతిభను పరిశీలించి తుది ఎంపిక జరుపుతుంది. ఫిజికల్ ఫిట్‌నెస్ తప్పనిసరి. అందుకు మెడికల్ టెస్ట్ కూడా ఉంటుంది.

కోర్సు వివరాలు: కోర్సు కాల వ్యవధి మూడేళ్ళు కాగా ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఒక్కో సెమిస్టర్ 20 వారాల పాటు ఉంటుంది. మొదటి మూడు సెమిస్టర్లు కామన్. చివరి మూడు సెమిస్టర్లలో స్పెషలైజేషన్ ఉంటుంది. ఇందులో డిజైన్, డైరక్షన్‌లో మాత్రం అయిదుగురు విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంటుంది. కోర్సుకు ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.9,500 చెల్లిస్తారు.

దరఖాస్తు: ఫీజు రూ.50. **దరఖాస్తుకు ఆఖరు తేదీ:** మే 10

వెబ్‌సైట్: www.nsd.gov.in http://www.onlineadmission.nsd.gov.in

ఎన్‌పీసీఐఎల్‌లో ఎగ్జిక్యూటివ్ ట్రైనీలు

జాబ్ కార్నర్

ముంబయిలోని కేంద్రప్రభుత్వ రంగ సంస్థ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్) కింది విభాగాల్లో 400 ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హులైన అభ్యర్థులు ఏప్రిల్ 30 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఎగ్జిక్యూటివ్ ట్రైనీ: 400 పోస్టులు. (ప్రస్తుత ఖాళీలు 396, బ్యాక్‌లాగ్ ఖాళీలు 4)

విభాగాలు: మెకానికల్, కెమికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్.

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ, బీటెక్, బీఎస్సీ/ ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.

NPCIL

వయసు: ఏప్రిల్ 30 నాటికి 26 సంవత్సరాలు మించకూడదు.

ప్రారంభ వేతనం: నెలకు రూ.56,100

ఎంపిక: గేట్ 2022/ 2023/ 2024 స్కోర్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.500(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: ఏప్రిల్ 30

వెబ్‌సైట్: https://npcilcareers.co.in/MainSiten/default.aspx

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/N2VHWUUలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

అసలైన రామాయణాన్ని తీయబోతున్నాం
- యశ్



ఇప్పటివరకూ పలు భారతీయ భాషల్లో రామాయణంపై ఎన్నో చిత్రాలు వచ్చాయి. వాటిల్లో ఎన్నో అభూత కల్పనలు, వక్రీకరణలు, మార్పులు చోటు చేసుకున్నాయి. క్రియేటివ్ ఫ్రీడమ్ పేరుతో రచయితలు, దర్శకులు చేసిన ప్రయోగాల వల్ల కొన్ని సినిమాలు అపఖ్యాతిని మూటగట్టుకున్నాయి. వాటన్నింటికీ భిన్నంగా నిజమైన రామాయణాన్ని వెండితెరపైకి తెచ్చేందుకు తాము సిద్ధమవుతున్నామని హీరో యశ్ చెప్పారు. ఆయన సొంత నిర్మాణ సంస్థ మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్, నిర్మాత నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ సంయుక్తంగా రామాయణాన్ని నిర్మించబోతున్నారు. నితీశ్ తివారి దర్శకత్వం వహిస్తున్నారు. 'ఇప్పటి వరకూ చాలా రామాయణాలు వెండితెరపైన వచ్చినా అందులో పూర్తిగా రామాయణం ఆధారంగా తెరకెక్కిన చిత్రం ఏది అనేది తెలియదు. కానీ మేం ఇప్పుడు అసలైన రామాయణాన్ని తీయబోతున్నాం' అని యశ్ శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రామాయణం చేస్తే బాగుంటుందని నమిత్, నేను చాలా సార్లు అనుకున్నాం. కానీ అంత పెద్ద సబ్జెక్ట్‌ను తీయాలంటే బడ్జెట్ సరిపోదు. అందుకు నేను కూడా సహ నిర్మాతగా చేరాను. రామాయణానికి నా మనసులో ప్రత్యేక స్థానం ఉంది. దానికోసం ఎంతైనా కష్టపడతాను. అందులో ఉన్న భావోద్వేగాలు, విలువలు గురించి ప్రపంచం అంతా చాటాలి. డీఎన్ఈజీ విజువల్ ఎఫెక్ట్ ద్వారా ఇప్పటివరకూ చూడని సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ప్రేక్షకులకు అందించబోతున్నాం' అని చెప్పారు. రామాయణం లాంటి గొప్ప ప్రాజెక్ట్‌ను ప్రపంచస్థాయి వేదికలపైకి తీసుకెళ్లాలంటే యశ్ లాంటి వారికే సాధ్యం అని నమిత్ మల్హోత్రా చెప్పారు. అయితే ఈ సినిమాలో యశ్ నటుడిగా ఏ పాత్రలో కనిపించనున్నారనే విషయాన్ని బయటపెట్టలేదు. గతంలో ఆయన రావణుడి పాత్రలో కనిపించనున్నట్లు వార్తలు వచ్చాయి. రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి సీతారాములుగా కనిపించనున్నారని టాక్. 'కేజీయఫ్' సిరీస్‌తో హీరోగా స్టార్‌డమ్ దక్కించుకున్నారు యశ్. ప్రస్తుతం ఆయన 'టాక్సిక్' అనే చిత్రం చేస్తున్నారు.

యూనిక్ కాన్సెప్ట్‌తో



'వైశాలి' చిత్రాన్ని అందించిన హీరో ఆది పినిశెట్టి, దర్శకుడు అరివళగన్‌ల కాంబినేషన్‌లో వస్తున్న మరో చిత్రం 'శబ్దం'. ఈ సినిమా టీజర్‌ను విక్టరీ వెంకటేశ్ శుక్రవారం విడుదల చేశారు. హీరో ఆది ఒక హాంటెడ్ హౌస్ దగ్గర కొన్ని వింత సంఘటనలు జరిగినప్పుడు విచిత్రమైన శబ్దాలను రికార్డ్ చేయడం కనిపిస్తుంది. ఒక యూనిక్ కాన్సెప్ట్‌తో దర్శకుడు ఈ టీజర్‌ను టెరిఫిక్‌గా ప్రజెంట్ చేశారు. 'వైశాలి'లో రెయిన్ బేస్డ్ సీన్లు చాలా ఉండగా, 'శబ్దం'లోని అధిక శాతం సీన్లను ముంబై, మున్నార్, చెన్నై వంటి పర్యాటక ప్రదేశాల్లో చిత్రీకరించారు. అలాగే ఈ సినిమా కోసం 120 ఏళ్ల నాటి లైబ్రరీ సెట్ వేయడం విశేషం. సిమ్రన్, లైలా, లక్ష్మీ మీనన్, రెడీన్ కింగ్స్లీ తదితరులు నటించిన ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తామని నిర్మాత సెవన్ జీ శివ చెప్పారు. తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.

అటు కృష్ణమ్మ... ఇటు దుర్గమ్మ

ఎటువంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా కేవలం ప్రతిభతో ఒక్కో మెట్టూ ఎక్కుతూ మంచి నటుడిగా పేరు తెచ్చుకున్న సత్యదేవ్ తాజా చిత్రం 'కృష్ణమ్మ' రస్టిక్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ మూవీగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం మే 3న విడుదల కానుంది.



వీవీ గోపాలకృష్ణ దర్శకుడు. ప్రముఖ దర్శకుడు కొరటాల శివ సమర్పణలో కృష్ణ కొమ్మాలపాటి నిర్మిస్తున్నారు.

ఈ సినిమా నుంచి 'దుర్గమ్మ' అనే సెలబ్రేషన్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటను సాకేత్ కొమండూరి పాడారు. కాలాభైరవ స్వరాలు సమకూర్చారు. నవరాత్రుల సమయంలో దుర్గమ్మ ముందు హీరో సంతోషంగా ఆడి పాడే పాట ఇది. అతీరా రాజ్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో లక్ష్మణ్, కృష్ణ, అర్చన, రఘు కుంచె, నందగోపాల్ ఇతర ముఖ్యతారాగణం.

చాలా రోజుల తర్వాత డాన్స్ చేశా
- వరలక్ష్మీ శరత్‌కుమార్



వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'శబరి'. అనిల్ కాట్జ్ దర్శకత్వంలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించారు. తెలుగు, హిందీతో పాటు పలు భారతీయ భాషల్లో మే 3న విడుదలవుతోంది. శుక్రవారం చిత్ర బృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. తెలుగు ట్రైలర్‌ను హీరో వరుణ్‌సందేశ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మీ శరత్‌కుమార్ మాట్లాడుతూ 'తెలుగులో తొలిసారి కథానాయిక ప్రాధాన్య చిత్రం చేశాను. మా నిర్మాత కథను నమ్మి రాజీపడకుండా సినిమా చేశారు. చాలా రోజుల తర్వాత ఈ సినిమాలో డాన్స్ చేశా' అన్నారు.

ఆస్పత్రిలో చేరిన సాయాజీ షిండే



పలు చిత్రాల్లో విలన్‌గా నటించిన సాయాజీ షిండేకు తీవ్రమైన ఛాతి నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ని హుటాహుటిగా మహారాష్ట్రలోని సతారా ఆస్పతిలో చేర్పించారు. పలు వైద్య పరీక్షల అనంతరం గుండెకు రక్తాన్ని సరఫరా చేసే నాళాలు బ్లాక్ అయ్యాయని వైద్యులు గ్రహించారు. వెంటనే ఆయనకు యాంజియోప్లాస్టీ చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. త్వరలోనే డిస్చార్జి చేస్తామన్నారు.

మహారాష్ట్రకు చెందిన సాయాజీ నటుడిగా తెలుగు వారికి సుపరిచితుడే. వచ్చీ రాని తెలుగులో ఆయన డైలాగులు పలికే విధానం ప్రేక్షకులను బాగా నవ్విస్తుంది. హిందీ, మరాఠీ చిత్రాల్లో నటించిన సాయాజీ దక్షిణాదిన కూడా పలు సినిమాల్లో కీలక పాత్రలు పోషించారు.

కార్తికేయ... వాయు వేగం

కార్తికేయ గుమ్మకొండ కథానాయకుడిగా ప్రశాంత్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి టైటిల్ ఖరారైంది. 'భజే వాయువేగం' అనే టైటిల్‌ను చిత్రబృందం ఖరారు చేసింది. శుక్రవారం మహేశ్‌బాబు సోషల్ మీడియా ద్వారా ఈ చిత్రం టైటిల్, ఫస్ట్‌లుక్ మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో క్రికెట్ బ్యాట్‌తో కార్తికేయ పరుగు తీస్తుండగా, నేపథ్యంలో కరెన్సీ ఎగురుతూ కనిపించింది. టైటిల్, పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉన్నాయి, సినిమా ఘన విజయం అందుకోవాలి అని మహేశ్‌బాబు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.



ఈ చిత్రాన్ని త్వరలో ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాణ సంస్థ యూవీ కాన్సెప్ట్స్ సన్నాహాలు చేస్తోంది. ఐశ్వర్యమీనన్ కథానాయికగా నటిస్తున్నారు. 'హ్యాపీడేస్' ఫేమ్ రాహుల్ టైసన్ ముఖ్యపాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: రధన్. సినిమాటోగ్రఫీ: ఆర్. డి రాజశేఖర్

రాజ్ తరుణ్ క్రైమ్ కామెడీ

రాజ్ తరుణ్, రాశీ సింగ్ హీరోహీరోయిన్లుగా నటించే కొత్త చిత్రం షూటింగ్ శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. రమేశ్ కుడుముల ని దర్శకుడిగా పరిచయం చేస్తూ మురళీధర్ రెడ్డి, కెబిఎన్ శ్రీనివాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. హీరో హీరోయిన్లపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు దర్శకుడు ప్రవీణ్ సత్తారు కెమెరా స్విచ్ ఆన్ చేయగా, మరో దర్శకుడు మారుతి తొలి క్లాప్ ఇచ్చారు. తొలి షాట్‌కు నక్కిన త్రినాథరావు గౌరవ దర్శకత్వం వహించారు.



ఈ సందర్భంగా ఏర్పాటైన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు మాట్లాడుతూ 'ఈ నెల 15 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుంది. అక్టోబర్‌లో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. ఇది క్రైమ్ కామెడీ. 'స్వామి రారా', 'అంధధూన్' చిత్రాల తరహాలో ఉంటుంది' అని తెలిపారు. నిర్మాతల్లో ఒకరైన శ్రీనివాస్ మాట్లాడుతూ 'కథ అద్భుతంగా వచ్చింది. మీ అందరికీ నచ్చుతుంది' అన్నారు. 'నా ఫేవరెట్ జానర్ క్రైమ్ కామెడీ. చాలా మంచి కథ. మీ అందరి ఆశీస్సులు కావాలి' అన్నారు రాజ్ తరుణ్. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్ చంద్ర, డీవోపి: ఆదిత్య జవ్వాడి, ఎడిటింగ్: ప్రవీణ్ పూడి.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Bw03CGf లో చదవండి.



న్యూ ఏజ్ సినిమా
దిల్‌రాజు

ఆశిష్, వైష్ణవిచైతన్య నటించిన చిత్రం 'లవ్ మీ'. ఇఫ్ యు డేర్ ఉప శీర్షిక. అరుణ్ భీమవరపు దర్శకత్వం వహించారు. శిరీశ్, దిల్‌రాజు సమర్పణలో హర్షిత్‌రెడ్డి, నాగమల్లిడి, హన్షిత నిర్మించారు. 'లవ్ మీ' చిత్రం ఈ నెల 25న విడుదలవుతోంది. ఇటీవల ఈ మూవీ ఆడియో వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ "సరికొత్త కథాంశంతో వస్తున్న ఈ న్యూ ఏజ్ సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది" అన్నారు. డైరెక్టర్ అరుణ్ భీమవరపు మాట్లాడుతూ "ఈ సినిమాకు వస్తున్న పాజిటివ్ వైబ్స్ చూసి సంతోషంగా ఉంది" అని అన్నారు. హీరో ఆశిష్ మాట్లాడుతూ "ఈ సినిమాలోని లవ్, హారర్, సస్పెన్స్ ఎలిమెంట్స్ అందరికీ మంచి థ్రిల్ ఇస్తాయి" అని అన్నారు. నటి వైష్ణవిచైతన్య మాట్లాడుతూ "డిఫరెంట్ లవ్ స్టోరీ ఇది" అని చెప్పారు. చిత్ర నిర్మాత హన్షిత మాట్లాడుతూ "ఎప్పుడైనా, ఎవరైనా గోస్ట్‌ని లవ్ చేశారా? లవ్ చేయండి. మీకు తప్పకుండా నచ్చుతుంది" అని చెప్పారు.

కిడ్నాప్ డ్రామా



చైతన్యారావు, సునీల్, శ్రద్ధా దాస్, మాళవిక సతీశన్ ప్రధాన పాత్రలు పోషించిన 'పారిజాత పర్వం' చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. సంతోష్ కంబంపాటి దర్శకత్వంలో మహీధర్ రెడ్డి, దేవేష్ నిర్మించిన హిలేరియస్ క్రైమ్ కామెడీ చిత్రమిది. ఈ సినిమా ట్రైలర్‌ను యాంకర్ సుమ లాంచ్ చేశారు. 'కేక్ కట్ చేసేటప్పుడు లైట్స్ ఆర్పుతారట. మళ్లీ లైట్స్ వేసే లోపు కేక్‌తో పాటు వాళ్ల ఆవిడ కూడా మన బండిలో ఉండాలి' అని కిడ్నాప్ ప్లాన్‌ను సునీల్ తన గ్యాంగ్‌కు వివరిస్తుండగా మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది.

'కిడ్నాప్ ఈజ్ యాన్ ఆర్ట్' అనే ట్యాగ్ లైన్‌ను జస్టిఫై చేస్తూ ఇందులో చూపించిన సన్నివేశాలు హిలేరియస్‌గా ఉన్నాయి. చైతన్యా రావు, సునీల్, శ్రద్ధా దాస్.. ఈ మూడు పాత్రల చుట్టూ నడిపిన కిడ్నాప్ డ్రామా ఇది. విజువల్స్, నిర్మాణ విలువలు బాగున్న ఈ ట్రైలర్ సినిమా మీద ఆసక్తిని మరింత పెంచింది.

మారిన పూతలపట్టు రాజకీయం

● ఎంఎస్ బాబు కాంగ్రెస్ అభ్యర్థి కావడంతో భారీగా చీలనున్న వైసీపీ ఓట్లు
● టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ విజయానికి మార్గం సుగమం

చిత్తూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టులో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు దెబ్బ వైసీపీకి గట్టిగానే తగిలేలా ఉంది. వైసీపీ టికెట్ దక్కక బయటికొచ్చేసిన ఆయన కాంగ్రెస్ తరఫున పూతలపట్టు నుంచి పోటీ చేయనున్నారు. ఈ ప్రభావం తీవ్రంగానే ఉండే అవకాశం ఉంది. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో పూతలపట్టు ఏర్పడింది. అప్పటి నుంచి ఇక్కడ టీడీపీ ఒక్కసారి కూడా గెలవలేదు. 2009లో కాంగ్రెస్ తరఫున రవి, 2014లో వైసీపీ నుంచి సునీల్‌కుమార్, 2019లో వైసీపీ నుంచి ఎంఎస్ బాబు పోటీ చేసి గెలుపొందారు. ఈ మూడు ఎన్నికల్లోనూ పలమనేరు మాజీ ఎమ్మెల్యే లలితకుమారి పోటీ చేశారు. ఇక, తాజాగా ఎన్నికల్లో టీడీపీ తరఫున జర్నలిస్టు మురళీమోహన్, వైసీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ బరిలో ఉన్నారు. తనకు టికెట్ లేదని చెప్పిన వెంటనే మీడియా ముందు ఆగ్రహం ప్రకటించిన ఎంఎస్ బాబు, ఆతర్వాత సర్దుకుని మౌనం వహించినట్టు కనిపించినా లోలోపల ఆయన కార్యకలాపాలు కొనసాగాయి. 2019లో టికెట్ నిరాకరించాక సునీల్ కుమార్ క్రియాశీలంగా లేరు. నియోజకవర్గంలో కనిపించేవారు కాదు. ఇప్పుడు టికెట్ మళ్లీ దక్కడంతో కిందామీదా పడుతున్నారు. సిటింగ్ ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు ఉన్నంత సంబంధాలు ఆయనకు లేవు. ఎంఎస్ బాబు పూతలపట్టు నియోజకవర్గంలో తనకంటూ ఓ వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. వైసీపీపై కోపాగ్రహాలతో ఉన్న ఆయన ఖర్చుకు కూడా వెనుకాడేట్టుగా లేరు. వైసీపీకి మళ్లిన కాంగ్రెస్ సంప్రదాయ ఓట్లను ఆయన చీల్చుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ముఖ్యంగా ఎస్సీ ఓట్లు ఆయన చీల్చుకుంటారని అంచనా. ఇందువల్ల టీడీపీ గెలుపు అవకాశాలు మరింత మెరుగు అవుతాయని అంటున్నారు.

టీడీపీకి నల్లేరు మీద నడకేనా?

పూతలపట్టు నియోజకవర్గం ఏర్పడినాక ఒక్క 2019 ఎన్నికలు మినహా మిగిలిన రెండు ఎన్నికల్లోనూ టీడీపీ అభ్యర్థి అతి తక్కువ ఓట్ల తేడాతోనే ఓడిపోయారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రవికి 64,484 ఓట్లు, టీడీపీ లలితకుమారికి 63,533 ఓట్లు పడ్డాయి. అంటే, రవి 951 ఓట్ల మెజార్టీతో మాత్రమే గెలుపొందారు. అలాగే 2014 ఎన్నికల్లో వైసీపీ సునీల్‌కుమార్‌కు 83,200 ఓట్లు, టీడీపీ లలితకుమారికి 82,298 ఓట్లు పడ్డాయి. 902 ఓట్ల తేడాతో సునీల్‌కుమార్ గెలిచారు. ఫ్యాను హవా నడిచిన 2019 ఎన్నికల్లో మాత్రం 30 వేల ఓట్ల తేడా ఉంది. దీన్నిబట్టి పరిశీలిస్తే ప్రభుత్వ వ్యతిరేకతకు ఎంఎస్ బాబు ప్రభావం తోడవుతుందని, టీడీపీ గెలుపు నల్లేరు మీద నడకగా మారుతుందని అంచనా వేస్తున్నారు. రాజకీయాలకు కొత్తవాడైన మురళిని టీడీపీ అభ్యర్థిగా ఎంపిక చేసినందున గెలుపు తమదే అని ఇప్పటిదాకా చెప్పుకుంటున్న వైసీపీ వర్గాల గొంతులో ఎంఎస్‌బాబు రూపంలో పచ్చి వెలక్కాయ పడ్డట్టు అయ్యింది.

వైసీపీ నమ్మకద్రోహం చేసింది

● విలువల్లేని పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరా ● పూతలపట్టు ఎమ్మెల్యేగా మళ్లీ గెలుస్తా ● ఎంఎస్ బాబు వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 12: 'వైసీపీ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కష్టపడ్డా. అలాంటి నాకు ఆ పార్టీ నమ్మద్రోహం చేసింది. వైసీపీ కోసం ఎంతో కష్టపడి పాదయాత్ర చేసిన షర్మిలమ్మకే నమ్మక ద్రోహం చేసిన విషయం తెలిసిందే. సొంత చెల్లెలికే అటువంటి పరిస్థితి అంటే నా గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు' అని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు వ్యాఖ్యానించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పూతలపట్టులో జరిగిన సిద్ధం సభకు స్థానిక ఎమ్మెల్యే అయిన తనను ఆహ్వానించకుండా అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ తనను వాడుకొని వదిలేసిందని వాపోయారు. నియోజకవర్గంలోని ప్రతి గడప తొక్కానని, ప్రతి ఇంటి కష్టం తనకు తెలుసన్నారు. కరోనా సమయంలోనూ ప్రజలకు అందుబాటులో, అండగా ఉన్నానని గుర్తుచేశారు. చిత్తూరు వాడినైన తనను పూతలపట్టు ప్రజలు సొంత మనిషిగా ఆదరించారని, వారి కష్టం తీర్చేందుకే కాంగ్రెస్‌లో చేరానని చెప్పారు. వీళ్లందరి ఆదరణతో పూతలపట్టు ఎమ్మెల్యేగా మళ్లీ గెలుస్తానని ధీమా వ్యక్తంచేస్తానని చెప్పారు. కాంగ్రెస్‌లో తన రాజకీయ ప్రస్థానం మొదలైందని, తిరిగి ఆ పార్టీ గూటికే చేరడం ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్ అండతో, ఏపీలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం వస్తుందన్నారు. షర్మిలమ్మను ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు. ఈ నెల 15న బంగారుపాళ్యం మండలంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల బస్సుయాత్రను భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వైసీపీ నుంచి కాంగ్రెస్‌లోకి చేరారు. ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విక్టోరియా, రాణి యాదవ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

చిత్తూరు, ఏప్రిల్ 12: జిల్లాలో తాగునీటికి ఎలాంటి సమస్య రాకుండా చూడాలని కలెక్టర్ షన్మోహన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, గ్రామీణ నీటి సరఫరా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పలమనేరు, కుప్పం, పుంగనూరు ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందన్నారు. నిబంధనల మేరకు గ్రామ పంచాయతీ నిధులను వినియోగించుకోవాలని చెప్పారు. మండల స్థాయిల్లో ఎంపీడీవోలు అప్రమత్తంగా ఉంటూ, నివేదికలు ఇవ్వాలన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉందని, వడదెబ్బకు ఎవరూ గురికాకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. జడ్పీ సీఈవో గ్లోరియా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉష్ణోగ్రతలు తగ్గుముఖం



చిత్తూరు గాంధీ విగ్రహం సర్కిల్‌లో పలుచగా కనిపిస్తున్న జనం

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 12: జిల్లాలో నాలుగు రోజులుగా ఉక్కపోతతో అల్లాడిన జనం శుక్రవారం కాస్త ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో ఉపశమనం పొందారు. సాయంత్రానికి ఆకాశం మేఘావృతం కావడంతో చల్లటి గాలులు వీచాయి. మండలాల వారీగా.. ఉష్ణోగ్రత వివరాలిలా ఉన్నాయి. నింద్రలో 39.3, తవణంపల్లెలో 38.5, గుడుపల్లె, సోమల, పుంగనూరులో 37.8, గుడిపాలలో 37.7, చిత్తూరులో 37.6, బంగారుపాళ్యం, శ్రీరంగరాజపురంలో 37.5, నగరి, విజయపురంలో 37.4, కుప్పంలో 37.2, సదుం, కార్వేటినగరంలో 36.9, వెదురుకుప్పంలో 36.8, చౌడేపల్లె, పాలసముద్రం, పులిచెర్ల, రొంపిచెర్లలో 36.4, గంగాధరనెల్లూరులో 36.3, పలమనేరు, పెనుమూరు, యాదమరిలో 35.9, పెద్దపంజాణిలో 35.5, పూతలపట్టు, శాంతిపురంలో 35.4, వి.కోటలో 34.9, గంగవరంలో 34.3, బైరెడ్డిపల్లెలో 34.2, ఐరాలలో 33.8, రామకుప్పంలో 33.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అక్రమ సంపాదనతో విజయానందరెడ్డి అరాచకాలు

● ఈద్గాను ప్రచార వేదికగా మార్చుకోవడంపై విచారించాలి: టీడీపీ

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 12: హరామ్ (అక్రమ) సంపాదనతో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానంద రెడ్డి అరాచకాలకు పాల్పడుతున్నాడని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, మాజీ మేయర్ కటారి హేమలత ఆరోపించారు. శుక్రవారం నగరంలోని గురజాల జగన్మోహన్ నివాసంలో వారు మీడియాతో మాట్లాడారు. రంజాన్ పర్వదినాన విజయానంద రెడ్డి ఈద్గాలో రాజకీయ ప్రసంగం చేయడం సిగ్గుచేటన్నారు. పైగా 'ముస్లింలు బిర్యానీ తింటారు.. గడ్డి తినరు' అని ఆయన చేసిన వ్యాఖ్యలు ముస్లింల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయన్నారు. ప్రార్థన జరుగుతున్న సమయంలోనే వేదికపైకి వెళ్లడం, రాజకీయ ప్రసంగం చేయడం, కొందరు ముస్లిం సోదరులను బెదిరించడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. ఈద్గాను ప్రచార వేదికగా మార్చుకోవడంపై కలెక్టర్ నిష్పక్షపాతమైన విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని కోరారు. ముస్లిం మైనార్టీ నేతలు అబుల్ హసేన్, అత్తుబాయ్, నౌషాద్, జనసేన నేత ఆరిఫ్ మాట్లాడుతూ.. ఈద్గా దర్గా ఖాజీ వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారని, ఆయన్ను తక్షణం పదవినుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ముస్లిం మైనార్టీ నేతలు జాఫర్, షరీఫ్, జిలాని, అన్సర్, మహబూబ్ బాషా, మున్నా, షేరు, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యపానంతో సీఎం జగన్ రూ.లక్ష కోట్ల లూటీ

మద్యపానంతో సీఎం జగన్ లక్షకోట్లు లూటీ చేశారని టీడీపీ నేతలు అన్నారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. కల్తీ మద్యంతో వేలాది మంది మహిళల మంగళసూత్రాలు తెంచిన వ్యక్తి జగన్ రెడ్డి అన్నారు. జే బ్రాండ్ల మద్యంతో దోచుకున్న లక్షల కోట్ల డబ్బును వైసీపీ నేతలు కంటైనర్ల ద్వారా ఎన్నికలకు తరలించారని ఆరోపించారు. మద్యనిషేధంపై మాటతప్పి మడమతిప్పిన జగన్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని చెప్పారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రకుమార్, అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, పార్టీ చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ నేతలు మోహన్‌రాజ్, వెంకటేష్ యాదవ్, ధరణి తదితరులు పాల్గొన్నారు.

కోడ్ అవస్థలు



కార్వేటినగరం, ఏప్రిల్ 12: ప్రతి చోటా జగన్ బొమ్మ ఉండటంతో ఎన్నికల కోడ్ దృష్ట్యా దాన్ని కనపడకుండా చేయడానికి అందరికీ అవస్థలు తప్పడం లేదు. అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసే పాల ప్యాకెట్లపైనా జగన్ బొమ్మ ఉండటంతో దానిపై కాగితం అంటించి సరాఫరా చేస్తున్నారు.

ముగిసిన జేఈఈ మెయిన్స్ పరీక్షలు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 12: జిల్లాలో ఈనెల 4న మొదలైన జేఈఈ మెయిన్స్ సెషన్-2 పరీక్షలు శుక్రవారం ఉదయంతో ముగిశాయి. వేమూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరీక్షా కేంద్రంలో జరిగిన పరీక్షలో 20 మందికిగాను 12మంది హాజరవగా, 8 మంది గైర్హాజరైనట్లు సిటీ కోర్డినేటర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. పరీక్షలు సజావుగా నిర్వహించడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

భూ సర్వేలో ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలి: జేసీ

చిత్తూరు, ఏప్రిల్ 12: భూ సర్వేలో ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలని జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా సర్వే, భూ రికార్డుల శాఖల అధికారులతో కలిసి జాతీయ సర్వే దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ఎన్నికలు పూర్తయ్యాక మిగిలిన సర్వే పనులను కూడా పూర్తి చేయాల్సి ఉందన్నారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. భూ రికార్డుల శాఖ సహాయ సంచాలకుడు గౌస్‌బాషా, డివిజన్, మండల, గ్రామ, వార్డు సర్వేయర్లు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోండి

● 12వేల మంది ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం
● ఎన్నికల విధులకు గైర్హాజరైతే సస్పెన్షన్ తప్పదు
● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ షన్మోహన్

చిత్తూరు, ఏప్రిల్ 12: జిల్లాలో వచ్చే నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఓటర్లంతా పోలింగ్ కేంద్రాలకెళ్లి ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ కోరారు. ఎన్నికల విధుల్లో ఉన్న 12వేల మంది ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించామన్నారు. ఎన్నికల విధులకు గైర్హాజరైన సిబ్బందిని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, పూతలపట్టు ఆర్వో చిన్నయ్య, చిత్తూరు ఏఆర్వో అరుణతో కలిసి మీడియా సమావేశాన్ని నిర్వహించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

● ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసుకోవడానికి ఎలాంటి అనుమతులు అవసరం లేదు. ముందస్తుగా సంబంధిత ఎస్‌హెచ్‌వోలకు సమాచారం ఇస్తే పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తాం. అయితే మేడే రోజున నిర్వహించే ఏ కార్యక్రమాలకైనా అనుమతి తీసుకోవాలి. వాహనాల్లో తెర ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్న అభ్యర్థులు అనుమతి తీసుకోవాలి.

● దివ్యాంగులు, 85 ఏళ్ల పైబడిన వారు ఇంటి నుంచి ఓటు వేసే అంశంపై ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు అభిప్రాయ సేకరణ చేపట్టను న్నాం. పూర్తిగా బెడ్‌పై ఉన్నవారు, నడవలేని వారు ఇంటి నుంచే ఓటు వేయడానికి చర్యలు తీసుకుంటాం.

● సీ-విజిల్ యాప్ ద్వారా 368 ఫిర్యాదులు అందాయి. 5,650 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నాం. జిల్లాలో ఈనెల 11వ తేదీ వరకు చేపట్టిన తనిఖీల్లో రూ.2,29,66,410, రూ.4,47,35,387 విలువ చేసే బంగారం, వెండిని, రూ.46,98,845విలువైన బియ్యం, గోడ గడియారం, కుక్కర్లు, డ్రెస్ మెటీరియల్స్ సీజ్ చేశాం.

● ఎంసీసీ అమలులో ఉన్నందున గంగమ్మ జాతర ఉత్సవాలపై నిర్వాహకులు ముందస్తుగా అనుమతి తీసుకోవాలి. పోలింగ్ తర్వాత రోజున జాతర జరుగుతున్నట్లు తెలిసింది. దీనికి పక్క రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారు. ఎన్నికల నిబంధనల మేరకు సరిహద్దుల్లో ప్రతి వాహనాన్నీ తనిఖీ చేస్తారు. ఓవైపు పోలింగ్, మరోవైపు బందోబస్తు పనులు కష్టమవుతుంది. జాతర నిర్వాహకులు తేదీని మార్పు చేసుకునే విషయంపై ఆలోచించుకోవాలని సూచిస్తున్నాం.

పకడ్బందీగా బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్

వీవీప్యాట్స్, కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లను పకడ్బందిగా ర్యాండమైజేషన్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోడౌన్‌లో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నియోజకవర్గాల వారీగా బ్యాలెట్ యూనిట్లకు ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ భవాని, ఈవీఎంల మేనేజర్ శ్రీదేవి, వివిధ రాజకీయ పార్టీల నేతలు అట్లూరి శ్రీనివాసులు, భాస్కర్, గంగరాజు, ఉదయ్‌కుమార్, సురేంద్రకుమార్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఐదు విడతల్లో 1,500 ఫోన్ల రికవరీ: ఎస్పీ





స్వాధీనం చేసుకున్న ఫోన్లు - బాధితురాలికి సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, ఏప్రిల్ 12: చాట్‌బాట్ ద్వారా జిల్లా పోలీసులు మొబైల్ రికవరీ మేళా నిర్వహించారు. నాలుగు విడతలుగా 1,200 ఫోన్లను రికవరీ చేయగా, తాజాగా ఐదో విడతలో 300 రికవరీ చేసి బాధితులకు అందించారు. శుక్రవారం బాధితులకు ఫోన్లను పోలీసులు అతిథి గృహంలో ఏఎస్పీ అరిఫుల్లాతో కలిసి ఎస్పీ మణికంఠ చందోలు అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నవారు ఇంట్లో నుంచే పోలీసు వారిని చాట్‌బాట్ ద్వారా సంప్రదించవచ్చన్నారు. ఫోన్లను రికవరీ చేయడంలో కృషి చేసిన క్రైమ్ సీఐ రామాంజినేయులు, చాట్‌బాట్ బృంద సభ్యులు బాషాజీ, రఘురామన్, శ్రీనివాసన్, బ్రహ్మారావులను ఎస్పీ అభినందించారు.

చాట్‌బాట్‌కు ఫిర్యాదు చేయడమిలా..

మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న వారు ముందుగా 94409 00004 వాట్సాప్ నెంబరుకు హాయ్ లేదా హెల్ప్ అని పంపాలి. ఆ తర్వాత వెల్‌కమ్ టూ చిత్తూరు పోలీసు పేరున ఓ లింకు వస్తుంది. అందులో గూగుల్ ఫార్మేట్ ఓపెన్ అవుతుంది. అందులో జిల్లా, పేరు, వయస్సు, తండ్రి, చిరునామా, కాంటాక్టు నెంబరు, మొబైల్ మోడల్, ఐఎంఈఐ నెంబరు, మిస్ అయిన ప్లేస్ వివరాలను సబ్మిట్ చేసిన వెంటనే ఫిర్యాదు నమోదవుతుంది.

ఫలించిన పవన్ భేటీ

● చల్లబడ్డ టీడీపీ నేతలు - ఆరణి శ్రీనివాసులుతో కలసి పనిచేయండి... మీ కష్టాన్ని వృథా కానివ్వమంటూ భరోసా
● మరో దశాబ్దంపాటు చంద్రబాబుతో కలిసి నడవాలని వుందన్న జనసేనాని



పవన్‌తో సుగుణమ్మ, ఆరణి శ్రీనివాసులు, టీడీపీ నేతలు

తిరుపతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తిరుపతి టీడీపీ నేతలతో జరిపిన భేటీ ఫలించింది. దాదాపు గంటపాటు ఆయన సుదీర్ఘంగా మాట్లాడిన తీరుతో టీడీపీ ముఖ్యనాయకులు చల్లబడ్డారు. జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుతో కలిసి పనిచేసేందుకు సూత్రప్రాయంగా అంగీకరించారు.తిరుపతి అసెంబ్లీ ఎన్డీఏ అభ్యర్థిగా జనసేన తరఫున ఆరణి శ్రీనివాసులును ప్రకటించి మూడు వారాలు కావస్తున్నా..ఇంకా కొందరు అలకపాన్పు దిగకపోవడంపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా దృష్టిసారించారు.శుక్రవారం సాయంత్రం ప్రత్యేక విమానంలో తిరుపతికి చేరుకున్నారు.తిరుచానూరు సమీపంలోని గ్రాండ్ రిడ్జ్ హోటల్లో కూటమి పార్టీలతో విడివిడిగా మాట్లాడారు. ముందుగా టీడీపీకి చెందిన 30 మంది ముఖ్యనేతలతో ఆయన భేటీ అయ్యారు. 'ఆరణి శ్రీనివాసులు అభ్యర్థిత్వం టీడీపీ అధినేత చంద్రబాబు , నేనూ కలిసి తీసుకున్న నిర్ణయం. ఆయన టికెట్ కోసం పార్టీలో చేరలేదు. చేరిన తర్వాతే టికెట్ ఇస్తామని చెప్పాం. అతను నాన్ లోకల్ అంశాన్ని తెరపైకి తీసుకొస్తున్నారు. స్థానికేతరుడు ఎందుకవుతారు? టీడీపీ, ప్రజారాజ్యం పార్టీలకు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. చంద్రబాబుకు బాగా సన్నిహితుడు. తిరుపతిలో సొంత ఇల్లు కూడా ఉంది. కాంట్రాక్టర్‌గా తిరుపతిలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారు. కలసి పనిచేయండి. ఫలితాల తర్వాత మీకష్టాన్ని వృధాకానివ్వం' అంటూ రెండు చేతులు జోడించి విజ్ఞప్తి చేయడంతో అసమ్మతి నేతలు సైతం కాసేపు ఆలోచనలో పడి కలిసి పనిచేయడానికి అంగీకరించారు. టీడీపీ ఇంచార్జి సుగుణమ్మ కష్టం కూడా అందరికీ తెలుసునని, గత ఎన్నికల్లోనే ఆమె గెలిచారని, ఆమెకు ఏమి చేయాలో చేస్తామని హామీ ఇచ్చారు. ఆమెతో మళ్లీ ప్రత్యేకంగా మాట్లాడతానన్నారు. ఆరణి శ్రీనివాసులు గెలుపుకన్నా అరాచక శక్తుల ఓటమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. చంద్రబాబును అక్రమంగా జైల్లో పెట్టిన క్రమంలో.. అమెరికా అధ్యక్షులను ఏపీకి తీసుకొచ్చిన వ్యక్తి అలా జైలుగోడల మధ్య ఉండడం చూసి తాను చలించిపోయానన్నారు. కష్టకాలంలో అండగా ఉండాలని భేషరతుగా అక్కడే మద్దతు ప్రకటించానని, ఆ తర్వాత బీజేపీ నేతలు నరేంద్ర మోదీ, అమిత్ షాలతో మాట్లాడి కూటమిలో టీడీపీని చేర్చేందుకు కీలకంగా పనిచేశానన్నారు. తాను 45 సీట్లు అడిగితే 24 సీట్లకు తగ్గాల్సి వచ్చిందని, బీజేపీ వాళ్ల కోసం మరో 3 వదులుకుని 21 సీట్లకే పరిమితమయ్యానన్నారు. కేంద్రంలో బీజేపీ, ఏపీలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తాయని సర్వేలన్నీ చెబుతున్నాయని, కేంద్ర సహకారం కావాలంటే బీజేపీ అవసరమనే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. దశాబ్దకాలం పాటు దార్శనికుడైన చంద్రబాబుతో కలిసి నడవాలనుకుంటున్నానని స్పష్టం చేశారు. జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు మాట్లాడుతూ తాను అనకాపల్లి టికెట్ ఆశించి నెల రోజులు ప్రచారం చేశానని....పొత్తులో భాగంగా వేరేవాళ్లకు ఇవ్వాల్సి రావడంతో తప్పుకున్నానన్నారు. ఈ భేటీలో ఎన్వీ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు మోహన్, సుగుణమ్మ, టీడీపీ నాయకులు నరసింహ యాదవ్, మబ్బు దేవనారాయణ రెడ్డి, ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాస్, ఊట్ల సురేంద్ర నాయుడు, చినబాబు, మహేష్ యాదవ్, కంకణాల రజనీకాంత్ , ఆర్సీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డీ.. నీకూ జగన్‌కీ ఇవే తుది ఎన్నికలు

● మాజీ మంత్రి అమరనాథరెడ్డి



మాట్లాడుతున్న అమరనాథరెడ్డి

పలమనేరు, ఏప్రిల్ 12: జిల్లాకు చెందిన మంత్రి పెద్దిరెడ్డికీ, ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికీ ఇవే తుది ఎన్నికలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి అన్నారు. తనకు ఇవే ఆఖరి ఎన్నికలంటూ పెద్దిరెడ్డి పేర్కొనడాన్ని ఖండిస్తూ శుక్రవారం ఆయన పలమనేరులో మీడియాతో మాట్లాడారు. 'మళ్లీ ఎన్నికల్లో పోటీచేసేందుకు పెద్దిరెడ్డికి వయస్సు లేదు. ఇక జగన్‌రెడ్డిని ప్రజలు ఒప్పుకోరు. ఇద్దరికీ 2024 చివరి ఎన్నికలు అవుతాయి' అని అమరనాథరెడ్డి వ్యాఖ్యానించారు. పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాల గురించి మంత్రి మాట్లాడారంటూ తన తండ్రి పుంగనూరు నియోజకవర్గ రాజకీయాల్లో ఉన్నారని, తన తాత జిల్లా బోర్డు సభ్యుడిగా పనిచేశారని, కుటుంబాల గురించి మాట్లాడాల్సి వస్తే చాలా ఉందన్నారు. కానీ తాను విజ్ఞతతో వాటి జోలికి వెళ్లడం లేదన్నారు. పెద్దిరెడ్డి రెండు పర్యాయాలు మంత్రిగా చేసిన దానికంటే తాను కేవలం 18 నెలల వ్యవధిలో నియోజకవర్గాల్లో చేసిన అభివృద్దే ఎక్కువన్నారు. పలమనేరు- కల్లుపల్లి రోడ్డు గురించి పెద్దిరెడ్డి మాట్లాడారని, తాను 22 నెలల వ్యవధిలో ఈరోడ్డును విస్తరించడం జరిగిందన్నారు. పెద్దిరెడ్డి చేసిన అభివృద్ధి ఏమిటో పుంగనూరులోని పుంగమ్మ చెరువు కట్టపైకి వెళ్లి నిలబడితే తెలుస్తుందని ఎద్దేవా చేశారు. 'పెద్దపంజాణిలో 10 వేల మెజారిటీ వస్తుందని పెద్దిరెడ్డి చెప్పిన మాట నిజం. కాకపోతే ఆ మెజారిటి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా నాకు వచ్చేది' అన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉన్నప్పుడు మేడికుర్తి ప్రాజెక్టుకు వేసిన టెండరు ఆమోదం పొందకపోతే ఆదికేశవులు నాయుడిని తీసుకొచ్చి చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చి ఆ ప్రాజెక్టుతో ఆర్థికంగా ఎదిగిన పెద్దిరెడ్డి కూడా చౌకబారుగా తనగురించి మాట్లాడితే ఎలా అన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

యువత భవిత కోసం చంద్రబాబును గెలిపించండి
టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు



కరపత్రాలు అందిస్తున్న టీడీపీ నేతలు

శాంతిపురం, ఏప్రిల్ 12: యువత భవిష్యత్తు కోసం టీడీపీ అధినేత చంద్రబాబును లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు అన్నారు. శుక్రవారం రేగడదిన్నేపల్లె, నల్లపరెడ్డూరు, చిన్నగాండపల్లె, ఎంకేపురం గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంచుతూ ఐదేళ్లలో వైసీపీ చేసిన అరాచకాలను ప్రజలకు వివరించారు. ప్రజలు ఆలోచించి ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి చంద్రబాబును, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాద్‌రావును గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఉదయకుమార్, విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, రమేష్‌రెడ్డి, బాలు, ఆర్ఎస్ మణి, నాగరాజు, చలపతిస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధం కావాలి



పుంగనూరులో పర్యటిస్తున్న బీసీవైపార్టీ నాయకులు

పుంగనూరు, ఏప్రిల్12: వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధం కావాలని బీసీవైపార్టీ నాయకులు సాంబమూర్తి, హరినాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని 9,10,11, 12,13 వార్డుల్లో పార్టీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ బీసీవై పార్టీ అధినేత బోడేరామచంద్రయాదవ్‌కు అవకాశం కల్పిస్తే నియోజకవర్గంలో పరిశ్రమలు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సమీఉల్లా, వేణు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లె : చౌడేపల్లె మండలంలో బీసీవై పార్టీ నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. శుక్రవారం వారు మండలంలోని పుదిపట్ల, 29ఏ చింతమాకులపల్లె, వెంగళపల్లె, పెద్దకొండామారి, గడ్డంవారిపల్లె, పరికిదోన, పందిళ్లపల్లె పంచాయతీలలో ప్రచారం నిర్వహించారు. రైతు బిడ్డ రామచంద్రయాదవ్‌కు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హరియాదవ్, సురేంద్రయాదవ్, మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకూడదు

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 12 : గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని మైనారిటీ కార్పొరేషన్ జిల్లా అధికారి ప్రభాకర్‌రెడ్డి సూచించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి గ్రామాల్లో తాగునీటిసమస్య లేకుండా చేపట్టాల్సిన చర్యల గురించి సూచనలిచ్చారు. అనంతరం కమ్మనపల్లె గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థినుల సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. ఇక్కడి వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డిపల్లె ఎంపీడీవో రాజేష్, ఈవోఆర్డీ రాజేంద్రబాలాజీ, కమ్మనపల్లె గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శోభ పాల్గొన్నారు.

కస్తూరిబా గాంధీ విద్యాలయ విద్యార్థినుల ప్రతిభ

రామకుప్పం, ఏప్రిల్ 12: విజలాపురంలోని కస్తూరిబాగాంధీ విద్యాలయ విద్యార్థినులు ఇంటర్ ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచారు. ఇంటర్ రెండో సంవత్సరం ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ అమరావతి తెలిపారు. పరీక్షలు రాసిన మొత్తం 17మంది విద్యార్థినులు ఉత్తీర్ణులైనట్టు ఆమె తెలిపారు. ఎంపీసీ విద్యార్థిని హేమలత 1000మార్కులకు గానూ 926, బైపీసీ విద్యార్థిని జయంతి 470మార్కులకు గానూ 435మార్కులు సాధించి మండల టాపర్‌లుగా, కేజీబీవీల్లో జిల్లా టాపర్లుగా నిలిచారని ఆమె వివరించారు. తమ విద్యాలయంలో ఇంటర్ రెండో సంవత్సర విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించడంలో పంచతంత్ర కార్యక్రమం ఎంతో దోహద పడిందని ప్రిన్సిపాల్ అమరావతి తెలిపారు. వెనుకటి రోజు జరిగిన పాఠ్యాంశాలపై మరుపటి రోజు పరీక్షలు నిర్వహించడం, స్టడీ అవర్లలో అధ్యాపకులు ప్రతి విద్యార్థినిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచడంతో వారు పరీక్షలు బాగా రాయగలిగారన్నారు.

కుప్పం వృత్తివిద్యా కళాశాల విద్యార్థుల ప్రతిభ

రామకుప్పం, ఏప్రిల్ 12: కుప్పంలోని ప్రభుత్వ వృత్తివిద్యా కళాశాల విద్యార్థులు విశేషప్రతిభ కనబరిచారు. జూనియర్ ఇంటర్‌లో ఓఏ గ్రూపు విద్యార్థిని సుస్మిత 500మార్కులకు గానూ 489, లలితారాణి 487, తబేసమ్ 486మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్‌లో ఎంఎల్‌టీ విద్యార్థిని నస్రీన్ 1000మార్కులకు గానూ 979 మార్కులు, ఓఏ విద్యార్థులు ధనుశ్రీ 977, హేమావతి 959మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో విశేషప్రతిభ కనబరిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ జ్యోతీశ్వరన్, జగదీష్‌బాబు, రెడ్డినాయక్, పకృద్దీన్, చంద్రశేఖర్, సత్యనారాయణ అభినందించారు.

తాగునీటి సమస్యలపై చర్యలు చేపట్టాలి

సోమల, ఏప్రిల్ 12: తాగునీటి సమస్యల పరిష్కారానికి 75 శాతం పంచాయతీ నిధులు వినియోగించాలని ఎంపీడీవో నారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో కలెక్టర్ షన్మోహన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కార్యదర్శులు పాల్గొన్నారు. కార్యదర్శులు గ్రామాలను సందర్శించి తాగునీటి సమస్యలను గుర్తించి అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకుల నుంచి నీరు వృథాగా పోకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మంచినీటి పథకాల బోర్ల మరమ్మతులపై ఫిర్యాదులు అందిన వెంటనే పనులు చేపట్టాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, కార్యదర్శులు సుధాకర్‌కుమార్, వెంకటరమణ, జయశంకర్, దివ్యభారతి, లలిత, మణి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



చౌడేపల్లె, ఏప్రిల్12: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తులకు ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, ఏప్రిల్12: పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారి భక్తులు సౌందర్యలహరి ఆలాపన చేశారు. ఆలయ నిర్వాహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణి భక్తులకు అన్నదానం నిర్వహించారు.

మాతాశిశు నమోదులో రొంపిచెర్ల ఫస్ట్

రొంపిచెర్ల, ఏప్రిల్ 12: చిత్తూరు జిల్లాలో మాతా శిశు నమోదులో రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రథమ స్థానంలో నిలిచిందని వైద్యాధికారులు డాక్టరు దినేష్‌కుమార్ నాయక్, డాక్టరు వినయ్ తెలిపారు. శుక్రవారం వారు ప్రాథమిక ఆరోగ్యసిబ్బందిని అభినందించారు. వంద శాతం నమోదు ఆన్‌లైన్, రిజిష్టర్‌లతో చేయడంతో ఆ డేటాను రాష్ట్ర అధికారులకు పంపించామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో లలితమ్మ, హెచ్‌ఈ రాజేశ్వరి, సూపర్‌వైజర్, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితం ఆదర్శం



ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటేసులు

పలమనేరు : అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శమని పలమనేరు ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశులు పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ఆయన అంబేడ్కర్ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ షణ్ముగం, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బి. నాగరత్నంరెడ్డి, అంబేడ్కర్ సార్వత్రిక విద్యాలయ కోఆర్డినేటర్ డాక్టర్ ఈ. వాసు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

17న విష్ణుపురిలో పూజలు



పలమనేరు : పలమనేరు సమీపంలోని విష్ణుపురిలో వెలిసిన నిర్వాణ నారాయణస్వామి ఆలయంలో శ్రీరామనవమి సం దర్భంగా ఈనెల 17న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త భోగనాథం సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద రామకోటి కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తమ మొక్కుబడులు చెల్లించుకొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ ధర్మకర్త సురేష్ విజ్ఞప్తిచేశారు.

టీడీపీలో చేరిక

రామకుప్పం, ఏప్రిల్ 12: మండలంలోని 89పెద్దూరు పంచాయతీ ననియాలకు చెందిన వైసీపీ 6వ వార్డు సభ్యుడు లక్ష్మీనారాయణ, వైసీపీ నేత షణ్ముగంతోపాటు నాలుగు కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. శుక్రవారం ఎమ్మెల్సీ కంచర్లశ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు వారికి కుండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ కో-కన్వీనర్ చంద్రశేఖర్, పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, గజేంద్ర, మహ్మద్‌రఫీ, ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి జయశంకర్, మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తా : చల్లా



రొంపిచెర్ల సమావేశంలో మాట్లాడుతున్న చల్లాబాబు, బండకిందపల్లె, ముంగరవాళ్లపల్లెలలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

రొంపిచెర్ల, ఏప్రిల్12: రానున్న ఎన్నికల్లో నాకు ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన సోమల, పుంగనూరు, రొంపిచెర్ల మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 25 సంవత్సరాలుగా ఎమ్మెల్యే, మంత్రి పదవిలో ఉండి రైతులకు, ప్రజలకు, యువత కోసం చేసింది శూన్యమని, ఆయన స్వప్రయోజనాలకు పనులు చేశారని అన్నారు. ఎవరైనా పశ్నిస్తే వారిపై అక్రమ కేసులు బనాయించారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే బీసీ, మైనార్టీలతోపాటు అన్నీ వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో మదనమోహన్‌రెడ్డి, చంద్రారెడ్డి, వెంకట్రమణారెడ్డి, బాస్కరయ్య, డీకె రెడ్డి, శివశంకర్, సదాశివయ్య, లక్ష్మయ్య, మల్లికార్జున, సీవీరెడ్డి, నగేష్, వినోద్‌రాయల్, అమరనాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరికలు

రొంపిచెర్ల మండలంలోని కమ్మోళ్లపల్లె, హనుమంతరాయనిపేట, మట్లోళ్లపల్లె, బండకిందపల్లె, దళితవాడకు చెందిన 30 కుటుంబాలు, అలాగే బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ ముగరవాళ్లపల్లెలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు చల్లా రామచంద్రారెడ్డి సమక్షంలో టీడీపీలోకి చేరారు. జపంషా, జమీల్, కలీల్‌భాషా, సామిరెడ్డి, అవినాష్, అగ్బర్, హబీబ్‌భాషా, ఆషీఫ్, గన్నీసుల్తాన్, ఇలియాజ్, వాహీద్, సంతోష్, గౌతం, బాబు, ముబారక్, మౌనందకుమార్, నాగిరెడ్డి, సురేష్‌రెడ్డి, స్వామిరెడ్డి, కార్తీక్‌రెడ్డి, గంగరాజ, ముబారక్, విక్రమ్, సపత్, లోకనాథరెడ్డి మరి కొందరికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

వైసీపీ అక్రమాలను ప్రజలకు చెప్పాలి

పుంగనూరు : వైసీపీ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలను ప్రజలకు వివరించాల్సిన అవసరముందని టీడీపీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు విరూపాక్షి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని భీమగానిపల్లెలో పర్యటించి ఇంటింటికి మ్యానిఫెసో కరపత్రాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి, బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిలను గెలిపించాలని కోరారు. వైసీపీ అధికారంలోకి రాగానే సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీల ఎన్నికలు జరగనివ్వకుండా ఏకగ్రీవంగా ఎన్నికలు జరిపారని, ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీశారని గుర్తు చేశారు. దౌర్జన్యాలు, అక్రమాలు చేసి పేదలను ఇబ్బందులు పెట్టారని, వారి ఆరాచకాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శమిపతి, గంగాధర్, రెడ్డెప్పనాయుడు, రమణ, డి. శ్రీనివాసులు, ఎస్ శ్రీనివాసులు, గోపీనాథ్, దేవరాజ్, కృష్ణానాయక్, గిరినాయుడు, రెడ్డెప్పయాదవ్, గంగరాజు, నరసింహులు, బాబునాయక్, రూపేంద్ర, శేఖర్, వెంకటేశ్, జనసేనా నాయకులు హరినాయక్, చైతన్యరాయల్, బాలాజీనాయక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సోమల : చల్లా రామచంద్రారెడ్డి, నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డిని గెలిపించాలని పుంగనూరు బీజేపీ కన్వీనర్ గన్నా మదన్‌మోహన్ బాబు ప్రచారం నిర్వహించారు. శుక్రవారం ఇరికిపెంట పంచాయతీలో ఇంటింటా ప్రచారం ప్రారంభించారు. బీజేపీ నాయకులు అజయ్ కృష్ణమాచారి, నాయుడు, నరేశ్, పార్థసారధి, శీలం రామూర్తి, చంద్రయ్య, రత్నయ్య, నవీన్ రాయల్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు : పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లిలో శుక్రవారం రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు రామనాథంనాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ, నాయకులు శ్రీనివాసులురెడ్డి, సుబ్బారెడ్డి, ధనంజయనాయుడు, గోపినాయుడు, కుమార్‌రెడ్డి, శ్రీనివాసులునాయుడు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఇంద్ర విమానంపై అగ్ని మారెమ్మ విహారం



గుడుపల్లె, ఏప్రిల్ 12: ఇంద్ర విమాన ఉత్సవంపై అగ్ని మారెమ్మ శుక్రవారం విహరించి భక్తులకు కను విందు చేసింది. గుండ్లసాగ రంలో కొలువైన అగ్ని మారెమ్మ దేవాలయం వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారికి అర్చ కులు శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకాలు, విశేషంగా పూజలు చేసి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టువస్త్రాలు, ఆభరణాలు, రంగు రంగుల పుష్పాలతో అలంకరించి ఇంద్ర విమాన ఉత్సవంపై అధిష్ఠింపజేసారు. అనంతరం మంగళవాయిద్యాలు, కోలాటాలు, పండలి భజనల నడుమ ఉత్సవాన్ని పుర వీధుల్లో ఊరేగించారు. మహిళలు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు ఇచ్చారు.

పోలింగ్ రోజున అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీవో

నగరి ఏప్రిల్ 12: పోలింగు రోజున ఎన్నికల అధికారులు అప్రమత్తంగా ఉండాలని నగరి నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో వెంకటరెడ్డి ఆదేశించారు. తన కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఎన్నికల అధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. నగరి, నిండ్ర, విజయపురం, పుత్తూరు వడమాలపేట మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆర్ఐలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

వెదురుకుప్పం, ఏప్రిల్ 12: జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న కారణంగా గంగజాతర, ఊరేగింపులు, ఇతరత్ర ఉత్సవాలకు తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని వెదురుకుప్పం తహసీల్దార్ జయంత్‌కుమార్ శుక్రవారం తెలిపారు. నిర్వాహకులు జిల్లా ఎన్నికల అధికారి నుంచి ముందస్తుగా అనుమతి తీసుకోవాలన్నారు.

వచ్చేనెల 14, 15 తేదీల్లో నడివీధి గంగమ్మజాతర

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 12: చిత్తూరు నడివీధి గంగమ్మజాతర మేనెల 14, 15 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఉత్సవ వంశపారంపర్య ధర్మకర్త సీకే లావణ్య తెలిపారు. శుక్రవారం మీడియాకు వివరాలు తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఉత్సవాన్ని నిర్వహిస్తామని.. భక్తులు ఎలాంటి ఆందోళనలు చెందవద్దని చెప్పారు. జాతరకు నగరవాసులు, భక్తులు సహకరించాలని కోరారు. ఉత్సవ నిర్వాహకులు వెంకటేష్, గుణశేఖర్, వేమారెడ్డి పాల్గొన్నారు.

వరసిద్ధుడి అన్నదానానికి రూ.లక్ష విరాళం



ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 12: కాణిపాక వరసిద్ధుడి ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రం నిజాంపేటకు చెందిన శివరామకృష్ణరావు శుక్రవారం రూ.1,00,116 విరాళంగా అందించారు. దాతకు దర్శన ఏర్పాట్లను ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ పర్యవేక్షించారు.

హయగ్రీవ అలంకారంలో మహావిష్ణువు



చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 12: గిరింపేట సీబీరోడ్డు వీరాంజనేయస్వామి ఆలయంలో నాలుగు రోజులుగా స్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్వామివారికి అభిషేకం నిర్వహించి హయగ్రీవ అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను ఉత్సవ నిర్వాహకుడు కేఎస్ కుమార్, అర్చకుడు కిషోర్ పంపిణీ చేశారు.

వైభవంగా కల్యాణోత్సవం



శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 12: ఎస్ఆర్‌పురం మండలం 49.కొత్తపల్లెమిట్టలో ద్రౌపదీ సమేత ధర్మరాజు కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవానికి ఉభయదారులుగా శెంజి వంశస్థులు వ్యవహరించారు.

అరాచక పాలనకు చరమగీతం పాడండి

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 12: రాష్ట్రంలో అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం మెదవాడ గ్రామ పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ మండల అధ్యక్షుడు విశ్వనాథ నాయుడు, జలంధర్ నాయుడు, డిల్లి, నిరంజన్‌రెడ్డి, బాబు నాయుడు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సర్వేయర్లకు ప్రశంస

వెదురుకుప్పం, ఏప్రిల్ 12: విధి నిర్వహణలో చూపిన ప్రతిభకుగాను మాంబేడు, బ్రాహ్మణపల్లి గ్రామ సచివాలయ సర్వేయర్లు టి.అనుష, అఖిల ప్రశంసలందుకున్నారు. శుక్రవారం చిత్తూరులో జరిగిన కార్యక్రమంలో వీరికి ప్రశంసాపత్రాలను జిల్లా సర్వే, భూమి రికార్డుల అధికారి కె.గౌష్‌బాష ప్రదానం చేశారు.

వడదెబ్బపై అవగాహన కార్యక్రమాలు

చిత్తూరు, ఏప్రిల్ 12: వేసవి ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో నగరపాలక సంస్థ పరిధిలో వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్నారు. కలెక్టర్ షన్మోహన్ ఆదేశాల మేరకు నగరంలోని అన్ని వార్డుల్లో కార్యదర్శుల ఆధ్వర్యంలో వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మురకంబట్టులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, ఏప్రిల్ 12: పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు శ్రీనివాసులు, మురళీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకుని చీరలు, రవికలు మొక్కలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు.

బీజేపీతో టీడీపీ పొత్తుపై వైసీపీ దుష్ప్రచారం

రామకుప్పం, ఏప్రిల్ 12: బీజేపీతో టీడీపీ పొత్తుపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాలను ముస్లిం నమ్మరాదని టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ సీతాపతి కోరారు. శుక్రవారం పట్టణంలోని ఇందిరానగర్‌లో వారు సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటా వివరించారు. వారు మాట్లాడుతూ బీజేపీతో టీడీపీ పొత్తు వల్ల ముస్లింలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. కార్యక్రమంలో నేతలు వినయ్‌కుమార్‌రెడ్డి, నవీన్‌యాదవ్, లక్ష్మీనారాయణ, ప్రసాద్, సురేష్, నాగరాజు, హేమాద్రి, సతీష్, కిషోర్‌కుమార్, బాలాజీ పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన

పలమనేరు, ఏప్రిల్12 : పట్టణంలోని బోయవీధిలో వైద్యాధికారి నిరంజన్‌కుమార్, సబ్‌యూనిట్ అధికారి, వైద్యఆరోగ్య సిబ్బంది వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించారు. 60 సంవత్సరాలు పైబడిన వారు, గుండెజబ్బులు ఉన్నవారు, చక్కెరవ్యాధిగ్రస్థులు వేసవిలో జాగ్రత్తగా వుండాలని, ఉదయం 11గంటల పైన ఇంటినుంచి వెలుపలికి రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. ప్రతి రెండుగంటలకు ఒక్కసారి మంచినీరు తాగాలని, బయటకు వెళ్లాలంటే తప్పక నల్లటి గొడుగు గాని, టోపి గాని పెట్టుకొని వెళ్లాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది హారతి, మంజుల, రాజేశ్వరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, ఏప్రిల్12: మండలంలోని ఆరడిగుంట క్రాస్ వద్ద కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. హెడ్‌కానిస్టేబుల్ కేశవరాజు కథనం మేరకు ... ఆరడిగుంటకు చెందిన రమేశ్, గణేశ్‌లు ద్విచక్రవాహనంలో పక్క గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఆరడిగుంట క్రాస్ వద్ద ఢీకొనడంతో ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తున్న రమేశ్, గణేశ్‌లు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని కోలార్ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రిక్రియేషన్ క్లబ్‌లో పారిశుధ్య చర్యలు

పలమనేరు, ఏప్రిల్12 : పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో శుక్రవారం పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఈ క్లబ్‌లో ప్రతి నెలా చెన్నె శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో ఉచిత నేత్రచికిత్సా శిబిరాలు నిర్వహిస్తుంటారు. క్లబ్ ఆవరణలో చెత్తాచెదారం లేకుండా చేసేందుకు శుక్రవారం క్లబ్ ప్రెసిడెంట్ రామచంద్రారెడ్డి, సభ్యులు టీకే షణ్ముగం, రాంబాబులు జేసీబీ సాయంతో చెత్తాచెదారాన్ని తొలగించే కార్యక్రమం చేపట్టారు. రిక్రియేషన్ క్లబ్ భవనం కూడా శిథిలావస్థకు చేరుకొన్నందున కొత్త భవనం నిర్మించే ప్రతిపాదన కూడా పరిశీలిస్తున్నట్లు క్లబ్ ప్రెసిడెంట్ తెలిపారు.

రేషన్ బియ్యం సీజ్



వి.కోట, ఏప్రిల్ 12: బైరెడ్డిపల్లె నుంచి కస్తూరినగర్ మీదుగా కర్ణాటకకు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. గురువారం రాత్రి 12 గంటల సమయంలో కసూర్తినగర్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా బియ్యం లోడుతో వచ్చిన వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. బియ్యం తరలింపునకు ఎలాంటి రికార్డులు లేకపోవడంతో అక్రమ రవాణాగా తేల్చి వాహనంతోపాటు 62 బస్తాల తమిళ రేషన్ బియ్యంసహా గుండ్లపల్లెకు చెందిన డ్రైవర్ వెంకటరమణ, లక్కనపల్లెకు చెందిన హరిబాబును అరెస్టు చేసినట్లు సీఐ లింగప్ప తెలిపారు. బియ్యాన్ని రెవిన్యూ వారికి అప్పగించారు.

టీడీపీలో చేరిన 55 కుటుంబాలు



మాజీ మంత్రి అమరనాథరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన పెంగరగుంట పంచాయతీ, కురప్పల్లి గ్రామస్తులు

పలమనేరు, ఏప్రిల్12: పలమనేరు మండలం పెంగరగుంట గ్రామం వద్ద శుక్రవారం మాజీ మంత్రి అమరనాథరెడ్డి సమక్షంలో 55 కుటుంబాలు టీడీపీలో చేరారు. పెంగరగుంట పంచాయతీలోని పెంగరగుంట, ఇందిరానగర్, తావడపల్లి గ్రామాలకు చెందిన 55 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ అమరనాథరెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీలో చేరిన వారిలో పెంగరగుంట వైస్ సర్పంచ్ ఈశ్వరిరాము, ఎంపీటీసీ సుబ్రమణ్యం, వార్డు సభ్యులు పవిత్ర, వెంకటేసు, నాగరాజు, తవడపల్లి వలంటీరు ధనలక్ష్మితోపాటు పెంగరగుంట, ఇందిరానగర్, మునలిమడుగు, కోతిగుట్ట, గ్రామాలకు చేరిన పలువురు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నాగరాజరెడ్డి, ప్రధానకార్యదర్శి గణేష్, నాయకులు జగదీష్‌నాయుడు, మల్లీశ్వరరెడ్డి, రామచంద్రనాయుడు, రామూర్తినాయుడు, స్వతంత్ర్యబాబు, జయరామయ్య, నాగరాజు పాల్గొన్నారు.

మళ్లీ టీడీపీలోకి చేరిపోయిన కురప్పల్లి గ్రామస్తులు

పలమనేరు మండలం కురప్పల్లి గ్రామానికి చెందిన గ్రామస్తులు వైసీపీలో చేరిన ఒక్కరోజు వ్యవధిలోనే మళ్లీ పలమనేరులో టీడీపీ కార్యాలయానికి వచ్చి మాజీ మంత్రి అమరనాథరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిపోయారు. టీడీపీలో చేరిన వారు మాట్లాడుతూ వ్యవసాయ పనులకు వెళ్తున్న తమకు వైసీపీ నాయకులు కండువాలు కప్పారని పేర్కొన్నారు. పార్టీలో చేరినవారిలో కురప్పల్లి గ్రామానికి చెందిన బగిసిరెడ్డి, గోవిందరాజులు, జయరాములు, సుబ్రమణ్యం, వెంకటేష్, గజేంద్రరెడ్డి, నటరాజన్, గోపి, రాజు, కూర్నిపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు, బుజ్జి ఉన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగరాజరెడ్డి, గణేష్, రామచంద్రనాయుడు, వెంకటమునిరెడ్డి, ద్వారకనాథరెడ్డి, కవీంద్రనాయుడు, నాగరాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గంజి పంపిణీ

నగరి ఏప్రిల్ 12: నగరి పట్టణ పరిధిలోని ఆదిపరాశక్తి ఆలయం వేసవి సందర్భంగా గంజిప్రసాదాన్ని ఆలయ నిర్వహకులు జ్యోతినాయుడు శుక్రవారం ఉదయం పంపిణీ చేశారు. బాటసారులకు ఉపశమనానికి రోజూ ఉదయం 8.30 గంటలకు గంజి, అంబలి, మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు. స్థానిక వైద్యులు భక్తవత్సలం, మంజుల, నగరి యూనియన్ బ్యాంకు మేనేజర్ యువరాజ్ పాల్గొన్నారు.

అన్నదానం

బంగారుపాళ్యం, ఏప్రిల్ 12: మండలంలోని బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద శుక్రవారం జరిగిన అన్నదాన కార్యక్రమానికి టేకుమంద గ్రామానికి చెందిన ఎగ్గిడి భాస్కర్, ఎగ్గిడి దీప కుటుంబ సభ్యులు భోజనం వితరణ చేశారు. జనార్దన్ గౌడ్, కొండేటి శివ, హరిప్రసాద్, లోకనాథం నాయుడు, మాధవ, మణి, చిరంజీవి పాల్గొన్నారు.

వచ్చేనెల 14, 15 తేదీల్లో నడివీధి గంగమ్మజాతర

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 12: చిత్తూరు నడివీధి గంగమ్మజాతర మేనెల 14,15తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఉత్సవ వంశపారంపర్య ధర్మకర్త సీకే లావణ్య తెలిపారు. శుక్రవారం మీడియాకు వివరాలు తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఉత్సవాన్ని నిర్వహిస్తామని.. భక్తులు ఎలాంటి ఆందోళనలు చెందవద్దని చెప్పారు. జాతరకు నగరవాసులు, భక్తులు సహకరించాలని కోరారు. ఉత్సవ నిర్వాహకులు వెంకటేష్, గుణశేఖర్, వేమారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ కార్యకర్తలు

విజయపురం, ఏప్రిల్ 12: పాతార్కాడులో సురేష్‌బాబు, 10 మంది వైసీపీ కార్యకర్తలు, కళియంబాకం, మిట్టకండ్రిగలో 15 మంది వైసీపీ కార్యకర్తలు శుక్రవారం నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి చినబబాబు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, సర్పంచ్ బొబ్బిలి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కైలాసంయాదవ్, నాయకులు గుణశేఖర్ రెడ్డి, మనోజ్, రోసినాయుడు, హరినాయుడు, ప్రసాద్, కిషోర్, గుణమ్మ, వేణుగోపాల్, టీడీపీ, జనసేన శ్రేణులు పాల్గొన్నారు.

నిండ్ర: అత్తూరు పంచాయతీ, దళితవాడ గుర్రప్ప నాయుడు కండ్రిగ, ఎస్టీ కాలనీ ప్రాంతాల్లో సూపర్ సిక్స్ కరపత్రాలను టీడీపీ నేతలు ఇంటింటికీ పంపిణీ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి విజయ్‌కుమార్, నేతలు గిరిబాబు, గాలి రమేష్‌నాయుడు, లోకేష్, పురుషోత్తం నాయడు, రాజగోపాల్,విజయ్‌కుమార్, రాంబాబు నాయుడు, కాటయ్య, మురళీనాయుడు, బాలాజి, దామునాయుడు, గోపి, సురేష్, శివరాజు, చంద్రకాంత్, చిన్న రాజేష్, బీజేపీ నేత రమేష్, జనసేన నేత శివలింగంపాల్గొన్నారు.

పేదల పక్షపాతి చంద్రబాబు: టీడీపీ



ఐరాల, ఏప్రిల్ 12: మాజీ సీఎం చంద్రబాబు పేదల పక్షపాతి అని పూతలపట్టు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. శుక్రవారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలసి మొరంపల్లె పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, నాయకులు జయచంద్రయ్య, సందీప్, లోకనాథరెడ్డి, యశ్వంత్ రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, దిలీప్, లోకేష్, శేషాద్రినాయుడు,తులసీప్రసాద్, ప్రసాద్, ప్రహ్లాదనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మండలంలోని కల్లూరుపల్లి పంచాయతి కొరివివారిపల్లె దళితవాడకు చెందిన 40 కుటుంబాలు ఎన్‌పీ జయప్రకాష్ నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. వీరికి మురళీమోహన్ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్‌పీ జయచంద్ర నాయుడు, ఎన్‌పీ ధరణి, మాజీ ఎంపీటీసీ భారతి వేణు, మహేంద్ర, ఎన్‌పీ విక్రమ్, జనార్దన్ గౌడ్, లోకేష్ రెడ్డి, రవి, గ్రామస్థులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

బంగారుపాళ్యం, ఏప్రిల్ 12: బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద శుక్రవారం జరిగిన అన్నదాన కార్యక్రమానికి టేకుమంద గ్రామానికి చెందిన ఎగ్గిడి భాస్కర్, ఎగ్గిడి దీప కుటుంబ సభ్యులు భోజనం వితరణ చేశారు. జనార్దన్ గౌడ్, కొండేటి శివ, హరిప్రసాద్, లోకనాథం నాయుడు, మాధవ, మణి, చిరంజీవి పాల్గొన్నారు.

పూతలపట్టు: మండలకేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద శుక్రవారం వీర్ల గుడిపల్లె గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం నాయుడు, హేమలత కుటుంబ సభ్యులు భోజనం వితరణ చేశారు. దిలీప్‌కుమార్, భవ్యశ్రీ, విజయశేఖర్, జగదీష్ నాయుడు, శ్వేత, బుజ్జి, మేఘనాథం నాయుడు, భూపతి నాయుడు, రామూర్తి నాయుడు, భార్గవ్, హరి, మధు, ఏకాంబరం, వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల: మండలకేంద్రంలో శుక్రవారం టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సర్పంచ్ అరుణ్, కిట్టు, షణ్ముగం, శేఖర్, కేబీ ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడండి : టీడీపీ

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 12: వైసీపీ సాగిస్తున్న అరాచక పాలనకు చరమగీతం పాడాలని ప్రజలకు టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం మెదవాడ గ్రామ పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ మండల అధ్యక్షుడు విశ్వనాథ నాయుడు, జలంధర్ నాయుడు, ఢిల్లి, నిరంజన్‌రెడ్డి, బాబునాయుడు, బీజేపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

గుడిపాలను ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతా

● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్

గుడిపాల, ఏప్రిల్ 12: గుడిపాల మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్ది.. యువతకు ఉపాధి కల్పించే బాధ్యతను తీసుకుంటానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్యే ఆర్.గాంధీ అన్నారు. శుక్రవారం మండలంలోని పానాటూరు, కొత్తపల్లె పంచాయతీల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. మండలంలో బుల్లెట్ ట్రైన్ వెళ్లే భూమి యజమానులందరికీ ఉద్యోగం కల్పిస్తామని, అర్హులైన ప్రతిఒక్కరికీ తల్లికి వందనం కింద ఒక్కో బిడ్డకు రూ.15వేలు చొప్పున, మహిళలకు నెలకు రూ.1500, రైతులకు సంవత్సరానికి రూ.20 వేలు, పింఛన్ రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, మహిళలకు సంవత్సరానికి ఉచితంగా మూడు సిలిండర్లు పంపిణీ చేస్తామని చెప్పారు. టీడీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, మాజీ జడ్పీటీసీలు బాలాజి నాయుడు, సుమతి మురళీనాయుడు, ఉపాధ్యక్షుడు అనిల్ కుమార్, టీడీపీ నాయకులు నిత్యానందం, చందురెడ్డి, చల్లా, కుమార్, బాబు, రమేష్, గుర్రప్ప నాయుడు, మధుసూదన్ నాయుడు, కిట్టు, శెల్వినాథన్, వెంకటేష్ యాదవ్, ఈశ్వర్ నాయుడు, మండల జనసేన అధ్యక్షుడు రూప్‌కుమార్, మండల బీజేపీ అధ్యక్షుడు ధనుంజయ నాయుడు, దేవా తదితరులు పాల్గొన్నారు.



పల్లూరులో టీడీపీ నాయకులతో గురజాల జగన్మోహన్

టీడీపీలోకి వైసీపీ కో-ఆప్షన్ మెంబర్

చిత్తూరు సిటీ: వైసీపీ కో-ఆప్షన్ మెంబర్ నళిని తిరుకుమరన్ టీడీపీలో చేరారు. శుక్రవారం దొడ్డిపల్లెలో మాజీ ఎమ్మెల్యే సీకేబాబు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ సమక్షంలో ఆమె టీడీపీలో చేరారు. అలాగే దొడ్డిపల్లెలోని సుమారు 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వైసీపీ నేతల చేష్టలకు విసిగిపోయి. పార్టీ నుంచి వీడుతున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు విజయానికి తాము కృషిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నేతలు త్యాగరాజన్, చంద్రప్రకాష్, బాలాజి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



నళిని తిరుకుమరన్‌కు టీడీపీ కండువా కప్పుతున్న సీకే బాబు

వరసిద్ధుడి అన్నదానానికి రూ.లక్ష విరాళం

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 12: కాణిపాక వరసిద్ధుడి ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రం నిజాంపేటకు చెందిన శివరామకృష్ణరావు శుక్రవారం రూ.1,00,116 విరాళంగా అందించారు. దాతకు దర్శన ఏర్పాట్లను ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ పర్యవేక్షించారు.

గంజిప్రసాదం పంపిణీ



నగరి ఏప్రిల్ 12: నగరి పట్టణ పరిధిలోని ఆదిపరాశక్తి ఆలయం వేసవి సందర్భంగా గంజిప్రసాదాన్ని ఆలయ నిర్వహకులు జ్యోతినాయుడు శుక్రవారం ఉదయం పంపిణీ చేశారు. బాటసారులకు ఉపశమనానికి రోజూ ఉదయం 8.30 గంటలకు గంజి, అంబలి, మజ్జిగ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. స్థానిక వైద్యులు భక్తవత్సలం, మంజుల, నగరియూనియన్‌బ్యాంకు మేనేజర్ యువరాజ్ పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం



శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 12: ఎస్‌ఆర్ పురం మండలం 49.కొత్తపల్లెమిట్టలో ద్రౌపదీ సమేత ధర్మరాజు కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవానికి ఉభయదారులుగా శెంజి వంశస్థులు వ్యవహరించారు.

వడదెబ్బపై అవగాహన కార్యక్రమాలు

చిత్తూరు, ఏప్రిల్ 12: వేసవి ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో నగరపాలక సంస్థ పరిధిలో వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్నారు. కలెక్టర్ షన్మోహన్ ఆదేశాల మేరకు నగరంలోని అన్ని వార్డుల్లో కార్యదర్శుల ఆధ్వర్యంలో వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మురకంబట్టులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఎంఎం గోపి, ఏఎన్‌ఎం సునీత, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే మహిళాభివృద్ధి

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 12: టీడీపీ పాలనలోనే మహిళాభివృద్ధి సాధ్యమని గురజాల జగన్మోహన్ సతీమణి ప్రతిమ అన్నారు. శుక్రవారం నగరంలోని 1, 50 వ డివిజన్‌లలో తెలుగు మహిళలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలుగుమహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, వెంకటేష్, రమణ, డిన్ను, గోపి, నాగలక్ష్మి, పల్లవి, ప్రతిభ, కృష్ణమూర్తి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గురజాలను గెలిపిస్తాం: కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు

చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవడానికి కాపులందరూ కృషిచేస్తామని కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆరేటి ప్రకాష్, కన్వీనర్ వాసిరెడ్డి ఏసుదాసు అన్నారు. శుక్రవారం నగరంలోని బీవీరెడ్డి కాలనీలోని రాష్ట్ర కాపు సంఘం నేతలు గురజాలను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి తమ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు, తిరుపతి, ప్రకాశం జిల్లాల బలిజ జేఏసీ అధ్యక్షులు రామ్మూర్తి, బండ్ల లక్ష్మీపతి, ఆకుపాటి వెంకటేష్ నేతలు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 12: సత్యనారాయణపురం ప్రాంతంలో జరుగుతున్న డ్రైడే కార్యక్రమాన్ని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రవిరాజు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటి పరిసరాలతోపాటు కాలువలను శుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు. ఆయనవెంట డీఎంవో శ్రీనివాసులున్నారు.

పోలింగ్ రోజున అప్రమత్తంగా ఉండాలి: ఆర్డీవో

నగరి ఏప్రిల్ 12: పోలింగు రోజున ఎన్నికల అధికారులు అప్రమత్తంగా ఉండాలని నగరి నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో వెంకటరెడ్డి ఆదేశించారు. తన కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఎన్నికల అధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. నగరి, నిండ్ర, విజయపురం, పుత్తూరు వడమాలపేట మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆర్‌ఐలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

వెదురుకుప్పం, ఏప్రిల్ 12: జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న కారణంగా గంగజాతర, ఊరేగింపులు, ఇతరత్ర ఉత్సవాలకు తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని వెదురుకుప్పం తహసీల్దార్ జయంత్‌కుమార్ శుక్రవారం తెలిపారు. నిర్వాహకులు జిల్లా ఎన్నికల అధికారి నుంచి ముందస్తుగా అనుమతి తీసుకోవాలన్నారు.

వైసీపీ ఓటమి ఖరారైంది : గాలి భానుప్రకాష్

నగరి, ఏప్రిల్ 12: రాష్ట్రంలో కూటమి పవనాలు వీస్తున్నాయని, వైసీపీ ఓటమి ఖరారైందని నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. పట్టణ పరిధిలోని సత్రవాడలో శుక్రవారం సూపర్‌సిక్స్ కరపత్రాలు పంచుతూ ఇంటింటి ప్రచారం చేశారు. సత్రవాడ యూనిట్ ఇన్‌చార్జి కరుణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భానుప్రకాష్ మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి వస్తే మరమగ్గ కార్మికులను ఆదుకుంటామని, విద్యుత్ చార్జీలు తగ్గించడమే గాక 500 యూనిట్లు ఉచితంగా ఇస్తామన్నారు. నగరి టీడీపీ కార్యదర్శి శ్రీనివాసన్, జ్ఞానశేఖర్, గోపిరెడ్డి, రవిచంద్రన్, వులగనాధన్, కదిరివేలు, అరవింద్, పొన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.



సత్రవాడలో ఇంటింట ప్రచారం చేస్తున్న భానుప్రకాష్

వైసీపీనుంచి టీడీపీలో పలువురి చేరిక



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వీకేఆర్‌పురం వాసులు

నగరి మండల పరిధిలోని వీకేఆర్‌పురం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు శుక్రవారం ఉదయం తిరుపతిలోని భానుప్రకాష్ ఇంటి వద్ద టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిలో.. వీకేఆర్‌పురానికి చెందిన జగన్, హరికృష్ణ, సురేంద్ర, గోవిందమండడి, మనోజ్ ప్రవీణ్‌కుమార్ కిరణ్‌కుమార్, మౌళీచంద్రన్, మురళిబాబుతోపాటు మరో 15 మంది యువత ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పురుషోత్తంనాయుడు, సీనియర్ నాయకులు సురేష్‌నాయుడు, మధునాయుడు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

హయగ్రీవ అలంకారంలో మహావిష్ణువు



చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 12: గిరింపేట సీబీరోడ్డు వీరాంజనేయ స్వామి ఆలయంలో నాలుగు రోజులుగా స్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్వామివారికి అభిషేకం నిర్వహించి హయగ్రీవ అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను ఉత్సవ నిర్వాహకుడు కేఎన్ కుమార్, అర్చకుడు కిషోర్ పంపిణీ చేశారు.

సర్వేయర్లకు ప్రశంస



ప్రశంసా పత్రం అందుకుంటున్న సర్వేయర్లు అఖిల, అనుష

వెదురుకుప్పం, ఏప్రిల్ 12: విధి నిర్వహణలో చూపిన ప్రతిభకుగాను మాంబేడు, బ్రాహ్మణపల్లి గ్రామ సచివాలయ సర్వేయర్లు టి.అనుష, అఖిల ప్రశంసలందుకున్నారు. శుక్రవారం చిత్తూరులో జరిగిన కార్యక్రమంలో వీరికి ప్రశంసాపత్రాలను జిల్లా సర్వే, భూమి రికార్డుల అధికారి కె.గౌష్‌బాష ప్రదానం చేశారు.

మరుగుదొడ్డికి తలుపేదీ?



బంగారుపాళ్యం, ఏప్రిల్ 12: మండలకేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో మరుగుదొడ్డి గదికి తలుపు లేకపోవడంతో ఇక్కడికొచ్చే మహిళలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా మూత్ర పరీక్షలు అవసరమైన గర్భిణుల అవస్థ అంతా ఇంతా కాదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

విద్యార్థినికి అభినందన



అఖీఫా

కార్వేటినగరం, ఏప్రిల్ 12: కార్వేటినగరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థిని బైపీసీ గ్రూపులో అఖీఫా వెయ్యి మార్కులకు 951 సాధించారని ప్రిన్సిపాల్ స్వరూప తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పలువురు అభినందించారు.

జిల్లాలో ఇంటర్ ఫలితాలు అత్యంత దారుణం: తెలుగుయువత

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 12: జిల్లాలో ఇంటర్ ఫలితాలు అత్యంత దారుణమని తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధులు వరుణ్ కుమార్, హేమాద్రి నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో జిల్లా 25వ స్థానంలో ఉండటం శోచనీయమన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు విద్యావవస్థను పట్టించుకోకపోవడమే ఈ ఫలితాలకు కారణమని ఆరోపించారు.

ఇంటర్ ఫలితాల్లో 'ప్రైవేటు' హవా

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 12: ఇంటర్మీడియట్ బోర్డు శుక్రవారం విడుదల చేసిన ఫలితాల్లో ప్రైవేటు కళాశాలలు తమ హవా కొనసాగించాయి. పలువురు విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు.

శ్రీవిద్యావికాస్ జూనియర్ కళాశాలలో..



ప్రతిభ చూపిన విద్యార్థులతో యాజమాన్యం



(ఇన్‌సెట్లో) కేఎం మౌనిక (ఎంపీసీలో 991 మార్కులు)

కొంగారెడ్డిపల్లెలోని శ్రీవిద్యావికాస్ జూనియర్ కళాశాలలో ద్వితీయ ఇంటర్ ఎంపీసీ చదువుతున్న విద్యార్థిని కె.ఎం.మౌనిక వెయ్యి మార్కులకుగాను 991 మార్కులు సాధించి టౌన్ ఫస్టుగా నిలిచిందని, టి.దీపిక 987 మార్కులు సాధించారని కళాశాల కరస్పాండెంట్ ప్రకాష్ చంద్రారెడ్డి తెలిపారు. బైపీసీ విభాగంలో పీవీ పల్లవి 957, సీఈసీ విభాగంలో ఫిర్దౌస్ 922 మార్కులు సాధించారు. ఫస్టియర్ ఎంపీసీలో 470 మార్కులకుగాను గజశివాని (462), జస్వంత్ (458) సాధించారు. వీరిని ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ మధుమూర్తి, రాజ, అధ్యాపకులతో కలిసి అభినందించారు.

పీఎస్‌ఎన్ శ్రీవివేకానంద కళాశాలలో..



సత్తాచాటిన విద్యార్థులతో కరస్పాండెంట్, అధ్యాపకులు

పీఎస్‌ఎన్ శ్రీవివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు కరస్పాండెంట్ పి.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ నాగరాజ శెట్టి తెలిపారు. ఫస్టియర్ ఎంపీసీలో 470 మార్కులకుగాను పి.దిలీప్‌కుమార్, ఎస్‌కే ఐశ్వర్య, పి.సాహితి (465), డి.నేహా (464), హాసిని, లాస్య, లిఖిత, మౌనిక, పల్లవి, శ్రీరామన్, వాసవి, ఉష్మశ్రీ, నిఖితలు (463) మార్కులు సాధించారన్నారు. సెకండ్ ఇంటర్‌లో ఎంపీసీలో వెయ్యి మార్కులకుగాను ఏసీ పవన్ (987), కె.చాందిని, కీర్తిరెడ్డి (985), మహ్మమద్ నఫ్వన్, చరిత చౌదరి (984), మోహిత్, ఆదర్శ కుమార్ (983), సాయి జాహ్నవి, అర్చన, మోహిత్, చౌదరి (982), బైపీసీలో మౌనిక శ్రీ (974), వైష్ణవి (943), సీఈసీ నందు మున్నా (923) మార్కులు సాధించారన్నారు. వీరిని అధ్యాపకులతో కలిసి అభినందించారు.

శ్రీ వివేకానంద కళాశాలలో..



సత్తాచాటిన విద్యార్థులతో యాజమాన్యం

శ్రీవివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు యాజమాన్యం మహేంద్రకుమార్, భాస్కర్‌నాయుడు తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకుగాను డి.లక్షయ, జి.కావ్య (463), పి.బాలు(462), జి.హర్షిత, సింధుజా (461), భావన (460), మార్కులు సాధించారన్నారు. బైపీసీలో 440 మార్కులకుగాను పి.గాయత్రి (419), కె.శైలు (415), సీఈసీలో 500 మార్కులకుగాను జాహ్నవి (480), హర్షవర్ధన్ (463) మార్కులు సాధించారని చెప్పారు. సెకండ్ ఇంటర్‌లో ఎంపీసీలో వెయ్యి మార్కులకుగాను కె.తరుణ్‌కుమార్ (990), కె.హర్షవర్ధన్ (986), ఎన్.పావని, టి.సుధ (985) మార్కులురాగా, బైపీసీలో వి.భావ్యశ్రీ(974), పి.ఏజెంల్ (967), సీఈసీలో వెయ్యికి గాను లక్ష్మిసాహిత (931), ఆర్.జస్వంత్ (924) మార్కులు సాధించారని వివరించారు. వీరిని అధ్యాపకులతో కలిసి అభినందించారు.

విజయం కళాశాలలో..



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

విజయం జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటినట్లు అధినేత తేజోమూర్తి తెలిపారు. ప్రథమ ఎంపీసీలో 470 మార్కులకుగాను జి.వైష్ణవి (455), జె.గగనసాయి (453), ద్వితీయ ఎంపీసీలో వెయ్యి మార్కులకుగాను ఎం.తనుశ్రీ (987), జగదీష్ చంద్రప్రసాద్ (971), విశ్వజిత్ (968) మార్కులు సాధించారన్నారు. ఆఫీసర్స్ లేన్‌లోని విజయం జూనియర్ కళాశాలలో ప్రథమ ఎంపీసీలో 470 మార్కులకుగాను కె.భరత్ (456), త్రిషా, సమీనా (455), నవ్య (453), బైపీసీలో సుమిత్రి (424/440), ఎంఈసీలో తన్మయి (486/500), సీఈసీలో 500 మార్కులకుగాను జెస్సిన (477), ప్రేమ్‌కుమార్ (461) మార్కులు సాధించారని వివరించారు. ద్వితీయ ఇంటర్‌లో వెయ్యి మార్కులకుగాను ఎం.శృతి, ఎ.జ్యోత్స్న(981) రితిక (972), బైపీసీలో అకిల్ ((949), సౌమ్య (936), ఎంఈసీలో ముఖేష్ సాయి (958), సీఈసీలో భరత్ (958), అనిల్ (954) మార్కులు సాధించారన్నారు. వీరిని అధ్యాపకులతో కలిసి అభినందించారు.

ఆర్కే జూనియర్ కళాశాలలో..



ప్రతిభ చూపిన విద్యార్థులతో అధ్యాపకులు

ఆర్కే జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు కరస్పాండెంట్ బద్రినారాయణ, ప్రిన్సిపాల్ రమేష్‌బాబులు తెలిపారు. ఫస్టియర్ ఎంపీసీలో 470 మార్కులకుగాను గుణశ్రీ (464), కె.ముంతాజ్ (461), హేమంత్ కుమార్, రోహిత్ (457), ప్రియ (455), బైపీసీలో 440 మార్కులకుగాను సుమలత (424), జువేరియా (416), అఫ్రిస్ (415) మార్కులు సాధించారన్నారు. సెకండియర్ ఎంపీసీలో వెయ్యి మార్కులకుగాను కె.మౌనిక, సుస్మిత, హంసవేణి (984), రజియభాను (982) సాధించగా, ఎంఈసీలో చతన్ (980), తేజస్విని (967) భవ్య (958), బైపీసీలో లోహితప్రియ (954) మార్కులు సాధించారు. వీరిని అధ్యాపకులతో కలిసి అభినందించారు.

'శ్రీవేద' విద్యార్థుల ప్రతిభ



ఆర్.యుమున - ఎస్.లహరి - వి.భానుతేజేష్ - పి.ఇస్మాయిల్ ఖాన్

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 12: ఇంటర్మీడియట్ ఫలితాల్లో పుత్తూరు పట్టణానికి చెందిన శ్రీవేద జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ బాలసరస్వతి తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఎస్.లహరి 987, వి.భానుతేజేష్ 989, పి.ఇస్మాయిల్ ఖాన్ 984 మార్కులు, బైపీసీలో ఆర్.యుమున 981 మార్కులు సాధించినట్లు వెల్లడించారు. అలాగే ప్రథమ సంవత్సరం ఎంపీసీలో టి.తులసి 466, ఆర్.సుజన్ 465, కే.రమ్యశ్రీ 465, పి.లహరి 464 మార్కులు, బైపీసీలో ఎం.ప్రమీదాభాను 434, సి.కీర్తి 433, కేసుప్రియ 433 మార్కులు సాధించినట్లు వివరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డైరెక్టర్లు సి.నారాయణబాబు, వేదవ్యాస్, ప్రిన్సిపాళ్లు వి.సనత్‌కుమార్, ఎస్.ఖాజావీర్ అభినందించారు.